www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -10 గురువారం 23 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# కదలని బస్సులు

## రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె తొలిరోజు విజయవంతం



**డిపోలకే పరిమితమైన బస్సులు**

**రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల మద్దతు**

**కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదం**

**సర్కార్ కుయుక్తులు..తప్పుకున్న సూపర్‌వైజర్ల సంఘం**

**హైదరాబాద్ ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె తొలిరోజు విజయవంతమైంది. సర్కారుతో చర్చలు విఫలమైన నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని 97 బస్ డిపోల్లో వేలాదిగా ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. సమ్మెకు ప్రభుత్వ మే కారణమనీ, అనివార్యమైందని ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు సర్కారు కుయుక్తులు పన్నుతున్నట్టు తెలిపింది. సూపర్‌వైజర్ల సంఘాన్ని సమ్మె నుంచి విరమింపజేసిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్నీ డిపోల ఎదుట ఆయా సంఘాల నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, ఇతరులు సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో రోడ్లన్నీ కళతప్పాయి. ఒకవైపు ఇదంతా జరుగుతుండగానే మరోవైపు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సమ్మె చట్టవిరుద్ధమని ప్రకటించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కా రానికి .**మిగతా 2లో...**

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

**తమిళనాడు, బెంగాల్‌లో ఏర్పాట్లు పూర్తి**

**భద్రత కట్టుదిట్టం మే 4న ఫలితాలు**



**న్యూఢిల్లీ : ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
దేశంలో ఎంతో ఉత్కంఠను రేపుతున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఇందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ప్రజలు ఓటు హక్కు ద్వారా వివిధ పార్టీల అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు నేడు ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి.**మిగతా 2లో...**



# తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు..

**ఆలయానికి పోటెత్తుతున్న భక్తులు**

**అందరి యాత్ర సుఖమయంగా సాగాలని ఆకాంక్షించిన మోదీ**

**ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
ఆధ్యాత్మిక ప్రపంచంలో నేడు ఒక పవిత్ర ఘట్టం ఆవిష్కృతమైంది. ఉత్తరాఖండ్‌లోని అత్యంత పవిత్రమైన శ్రీ కేదార్‌నాథ్ ధామం తలుపులు నేడు భక్తుల దర్శనార్థం తెరుచుకున్నాయి.**మిగతా 2లో...**



# మాజీ సీఎం నాదెండ్ల కన్నుమూత..

**వృద్ధాప్య సమస్యలతో నాదెండ్ల భాస్కరరావు**

**హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో కన్నుమూత**

**నేడు పంజాగుట్ట శ్మశానవాటికలో అంత్యక్రియలు**

**1984లో నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల**

**నాదెండ్ల వయసు 90 సంవత్సరాలు**

**హైదరాబాద్ ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. అనారోగ్య కారణాలు, వృద్ధాప్య సమస్యలతో హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతున్న నాదెండ్ల... కాసేపటి క్రితం తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. నాదెండ్ల భాస్కరరావు కుమారుడే ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్. ఆయన అంత్యక్రియలను పంజాగుట్ట శ్మశానవాటికలో రేపు సాయంత్రం 4 గంటలకు **మిగతా 2లో...**

# ఆరుగురు ఐపీఎస్‌లకు పదోన్నతులు

**తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ హోదా**

**పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**డీజీగా పదోన్నతి పొందినవారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సజ్జనార్**

**లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్**

2లో.




# కాల్పుల విరమణ పొడిగింపు!

**ఒప్పందం లేకపోతే బాంబుల మోత తప్పదు : ట్రంప్**

**మళ్లీ యుద్ధం మొదలైతే చమురు పరిశ్రమను దెబ్బతీస్తాం : ఐఆర్‌జిసి హెచ్చరిక- చర్చల కోసం పాక్ తిప్పలు**

**హోర్ముజ్‌లో నౌకలను అడ్డుకున్న ఇరాన్ గార్డ్స్**



**వాషింగ్టన్, టెహ్రాన్ :** ఇరాన్‌తో కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. బుధవారంతో రెండు వారాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో, మరో దఫా చర్చలు జరగాల్సి వున్న తరుణంలో మంగళవారం ఈ మేరకు ప్రకటన చేశారు. అయితే దీనిపై ఇరాన్ ఇంకా స్పందించాల్సి వుంది. **మిగతా 2లో...**

# భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు



**పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసింది: ప్రధాని నరేంద్రమోదీ**

**పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది -ఎక్స్ వేదికగా నివాళులర్పించిన ప్రధాని మోదీ**

**ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎప్పటికీ మరిచిపోలేమన్న మోదీ**

**ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఈ విషాదాన్ని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన నివాళులర్పించారు.**మిగతా 2లో...**

# ఎలాంటి చర్యలొద్దు



**కాళేశ్వరం కేసు.. కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో భారీ ఊరట**



**విచారణ కమిషన్ చట్టంలోని నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టీకరణ**

**కేసీఆర్, హరీశ్‌తో పాటు ఇద్దరు ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు తీర్పు**

**హైదరాబాద్ ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది.**మిగతా 2లో...**

# ప్రభుత్వానికి చెంపపెట్టు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో .**మిగతా 2లో...**

# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా

**ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూ కేటాయింపులు**

**ప్రముఖ కంపెనీలకు తొలి విడతలో భూములు**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ సూచన**



2లో.

# భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదు

మొదటిపేజీ తరువాయి

వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు.గత సంవత్సరం ఇదే రోజున పహల్గామ్‌లో దారుణమైన ఉగ్రదాడి జరిగిందని, అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు, బంధువులకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలో దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎన్నటికీ సఫలం కావని పేర్కొన్నారు. కాగా, గత సంవత్సరం ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

# తెరుచుకున్న కేదార్‌నాథ్ తలుపులు..

మొదటిపేజీ తరువాయి

మంచు కొండల నడుమ కొలువైన కేదార్‌నాథ్ ఆలయం నేడు ఉదయం 8 గంటలకు వైభవంగా తెరుచుకుంది. వేద మంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య సుమారు 51 క్వింటాళ్ల పూలతో అందంగా అలంకరించిన ఈ పుణ్యక్షేత్రం భక్తులకు స్వాగతం పలికింది. స్వామి వారి సందర్శనార్థ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మరోవైపు, రేపు విష్ణుమూర్తి నివాసమైన బద్రీనాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా భక్తులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక సందేశాన్ని ఇచ్చారు. చార్‌ధామ్ యాత్ర మన దేశ విశ్వాసానికి, ఐక్యతకు మరియు సుసంపన్నమైన సంప్రదాయాలకు దివ్య ఉత్సవం వంటిదని ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్కరి యాత్ర సుఖమయంగా సాగాలని, బాబా కేదార్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

మొదటిపేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లో మొత్తం 294 నియోజకవర్గాలకు గానూ రెండు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. అందులో మొదటి దశలో భాగంగా 152 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగతా 142 స్థానాలకు ఈనెల 29న పోలింగ్ జరగనున్నది. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. మే 4న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

# ఆరుగురు ఐపీఎస్‌లకు పదోన్నతులు

**తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డైరెక్టర్ జనరల్ హోదా**

**పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**డీజీగా పదోన్నతి పొందినవారిలో మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సజ్జనార్**

**లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉన్న మహేశ్ భగవత్**

**హైదరాబాద్ ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** తెలంగాణలో ఆరుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందినవారిలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారుసిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు.

మహేశ్ భాగవత్ ప్రస్తుతం లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా ఉండగా, స్వాతి లక్రా స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్నారు. వీవీ శ్రీనివాసరావు తెలంగాణ పోలీసు నియామక మండలి చైర్మన్‌గా ఉన్నారు. సీఐడీ, మహిళా భద్రతా విభాగం, ఏసీబీ ఏడీజీగా చారు సిన్హా విధులు నిర్వహిస్తున్నారు. అనిల్ కుమార్ గ్రేహౌండ్స్ ఏడీజీగా ఉండగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ప్రస్తుతం వీసీ సజ్జనార్ ఉన్నారు.

# దావోస్, గ్లోబల్ సమ్మిట్ పెట్టుబడులపై ఆరా



**హైదరాబాద్, ఏప్రిల్ 22(జర్నలిస్ట్ వార్త):** : ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలకు వివిధ ప్రాంతాల్లో కేటాయించాల్సిన భూములకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.కంపెనీలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. పెట్టుబడులకు సంబంధించి దావోస్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో పలు కంపెనీలతో జరిగిన ఎంఓయూ లు, పురోగతిపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి చర్చించారు.వివిధ రంగాలలో పెట్టుబడులకు సంబంధించి ఇప్పటి వరకు గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఫ్యూచర్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల్లో సంస్థలకు ప్రాధాన్యతల వారీగా కేటాయించాల్సిన భూ వివరాలను సీఎంకు తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటిని ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సిఎం అన్నారు. పేరున్న బ్రాండ్ సంస్థలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు తమ కార్యకలాపాలు మొదలు పెట్టేలా చూడాలని, ఇందుకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు.

# ప్రభుత్వానికి చెంపపెట్టు

ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో కాంగ్రెస్ కుట్రలు కూలిపోయాయని విమర్శించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన స్టేను స్వాగతించారు. ఈ తీర్పు ఇచ్చిన హైకోర్టుకు, మంచి వాదనలు వినిపించిన బీఆర్ఎస్ లీగల్ సెల్‌కు ధన్యవాదాలు చెప్పారు. ఇది ముమ్మాటికీ తెలంగాణ ప్రజలు, రైతాంగం సాధించిన విజయమని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షసాధింపు చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. రాజకీయాల కోసం రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేయొద్దని కోరారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని చిల్లర ప్రచారాలు బంద్ చేసి ప్రాజెక్టు మరమ్మతులపైన, పరిపాలనపైన దృష్టి పెట్టాలని సూచించారు. అది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదనీ, పీసీసీ నివేదిక అని తాము ముందు నుంచి చెప్తున్న మాట అక్షరాల నిజమని తేలిపోయిందని చెప్పారు. కాళేశ్వరంపైన కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారం హైకోర్టు తీర్పుతో పటాపంచలైందన్నారు. అంతిమ విజయం సత్యానిదే అని రుజువైందని అన్నారు. గోబెల్స్ ప్రచారం చేసిన వారికి హైకోర్టు గుణపాఠం చెప్పిందన్నారు. రూ.94 వేల కోట్ల ప్రాజెక్టును నిర్మిస్తే రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగిందంటూ అబద్ధాలను ప్రచారం చేశారని విమర్శించారు.

**మేడిగడ్డకు మరమ్మతులు చేయాలి : హరీశ్‌రావు**

ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చెల్లదనీ, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. చిల్లర రాజకీయాలు మాని మేడిగడ్డకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వంద కాంపోనెంట్లలో రెండు పిల్లర్లు కుంగితే రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయంటూ కాంగ్రెస్ చేసిన గోబెల్స్ ప్రచారం, రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టి డ్రామాలు ఆడిన సీఎం రేవంత్‌రెడ్డి నిజస్వరూపం తేటతెల్లం అయ్యిందని పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలు, కక్షసాధింపులు మాని ఆ రెండు పిల్లర్లకు వెంటనే మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు బనాయించి లొంగదీసుకోవాలని చూస్తే భయపడేది లేదనీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ప్రకటించారు. కాళేశ్వరమే ఈ రాష్ట్రానికి ప్రాణాధారమని పేర్కొన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పీసీసీ నివేదిక అని బీఆర్ఎస్ ముందే చెప్పిందని మాజీమంత్రి జి జగదీశ్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ మాత్రమే కాదన్నారు. ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాజీ ఎంపీ బి వినోద్ కుమార్ అన్నారు. మేడిగడ్డ లేకపోతే కరువు కాలంలో ఉత్తర తెలంగాణ ఎడారిగా మారుతుందన్నారు. ఇప్పటికైనా మేడిగడ్డ పిల్లర్లకు మరమ్మత్తులు చేయాలని కోరారు. పీసీ ఘోష్ నివేదికపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు అని మాజీమంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్, దేవీప్రసాద్, గోసుల శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు.

# మాజీ సీఎం నాదెండ్ల కన్నుమూత..

మొదటిపేజీ తరువాయి

నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. నాదెండ్ల మృతి పట్ల ఇరు తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1935 జూన్ 23న గుంటూరు జిల్లాలో నాదెండ్ల భాస్కరరావు జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన ఆయన... 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1982లో ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన సమయంలో ఆ పార్టీలో చేరారు. 1984లో చికిత్స కోసం ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమెరికా వెళ్లిన సమయంలో... కొంత మంది ఎమ్మెల్యేల మద్దతులో నాదెండ్ల సీఎం అయ్యారు. నెల రోజుల పాటు సీఎంగా ఉన్న నాదెండ్ల... ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

1989లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. 1998లో ఖమ్మం నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నుంచి రాజకీయాలకు దూరంగా ఉన్నారు. మర్రి చెన్నారెడ్డి, అంజయ్య, ఎన్టీఆర్ హయాంలో నాదెండ్ల మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించారు.

## టీడీపీకి కర్త, కర్మ, క్రియ

ఆంధ్ర ప్రదేశ్ రాజకీయాల్లో నాదెండ్ల భాస్కర్ రావు



గురించి పెద్దచరిత్రే ఉంది. అన్నఎన్టీఆర్ తెలుగు దేశం పార్టీ పెట్టడానికి కర్త, కర్మ,క్రియగా వ్యవహరించారు. అంతేకాదు తెలుగు దేశం పార్టీ పెట్టినకొత్తలో ఎన్టీఆర్ తర్వాత నెంబర్ టూ స్థానం ఈయనదే. ఇక 1984లో ఎన్టీఆర్ గుండె బైపాస్ సర్జరీ కోసం అమెరికా వెళ్లినపుడుపార్టీని చీల్చి ముఖ్యమంత్రిఅయ్యారు. ముందుగా కాంగ్రెస్ పార్టీఅండగా నిలుస్తుందనే హామీతో సీఎం పీఠం ఎక్కారు. ఆ తర్వాతఎన్టీఆర్ ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.. ఆపై కాంగ్రెస్ పార్టీ తన మద్దతు ఉపసంహరించుకోవడంతో నాదెండ్ల భాస్కర్ రావుముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఉమ్మడిరాష్ట్రంలో అతి తక్కువ కాలం ముఖ్యమంత్రిగా 1984 ఆగష్టు 16నుంచి సెప్టెంబర్ 16 వరకు ఈ పదవిలో కొనసాగారు.

## తిరిగి కాంగ్రెస్ గూటికి..

ఇక కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన ఈయన ఆతర్వాత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు దేశం పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అన్న ఎన్టీఆర్ కి వెన్నుపోటు ఎపిసోడ్ తర్వాత తిరిగికాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. చివర్లో మాత్రం భారతీయ జనతా పార్టీలో చేరినా.. పెద్దగా యాక్టివ్ గా లేరు. ఈయన కుమారుడునాదెండ్ల మనోహర్ ఏపీ మంత్రిగా ఉన్నారు. అంతేకాదు ఉమ్మడిఆంధ్ర ప్రదేశ్ లో డిప్యూటీ స్పీకర్ గా.. స్పీకర్ గా పనిచేశారు..

## స్వస్థలం గుంటూరు

నాదెండ్ల భాస్కర్ రావు అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీలో భాగంగా ఉన్నఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరులో 23 జూన్ 1935లో జన్మించారు.ఆంధ్ర ప్రదేశ్ 11వ ముఖ్యమంత్రిగా అతి తక్కువ కాలం పనిచేశారు.

అంతేకాదు ఈయన తెనాలి నుంచి శాసనసభ్యుడిగా పలుమార్లుఎన్నికయ్యారు. అంతేకాదు 1978లో చెన్నారెడ్డి ప్రభుత్వంలోమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకా..ఆయన క్యాబినేట్ లో ఫైనాన్స్ మినిస్టర్ గా పనిచేశారు. ఈయనఉస్మానియా యూనివర్సిటీ నుంచి 'లా' పూర్తి చేశారు. 1998లో 12వ లోక్ సభకు ఖమ్మం నుంచి ఎన్నికయ్యారు. ఆ తర్వాత రాజకీయంగా అంతగా యాక్టివ్ గా లేకపోయినా.. ఆ మధ్య విడుదైలనఎన్టీఆర్ బయోపిక్ లో తన పాత్రను తప్పుగా చూపించారని కోర్టులోకేసు ఫైల్ చేసి మరోసారి వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె తొలిరోజు విజయవంతం

మొదటిపేజీ తరువాయి

సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయాలనీ, కార్పొరేషన్‌లో కార్మిక సంఘాలను అనుమతించాలనీ, ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలపై ఆంక్షలు ఎత్తివేయాలనీ, విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ ఆర్టీసీ సంస్థే నిర్వ హించాలనీ, ఆర్టీసీని పరిరక్షించాలనీ, పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 17 డిపోల్లోని కార్మికులు దాదాపు 35వేల మందికిపైగా సమ్మెలో పాల్గొ న్నారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్, సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్టాండ్లతోపాటు హైదరాబాద్, రంగారెడ్డి రీజియ న్లల్లో ఆర్టీసీ బస్టాండ్లు, డిపోలు బోసి పోయాయి. ఆర్టీసీ జేఏసీ నేతలంతా ఆయా డిపోల్లో సమ్మెలో పాల్గొన్నారు. బుధవారం నగరం లోని గన్‌పార్క్ సందర్శించి అమర వీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. మరోపక్క ప్రభుత్వం అనుభవం లేని డ్రైవర్లతో బస్సులను నడిపే ప్రయత్నం చేసింది. అలాగే డిపోల వద్ద పోలీసు పహారా మధ్య ఆర్టీసీ బస్సులను జిల్లాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. కరీంనగర్‌లో ఈ తరహా ప్రయత్నం వికటించింది. బస్సు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు.

**ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సర్వీసుల పెంపు**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సర్వీసులను పెంచింది. అదనపు ట్రిప్పులు వేయాలని నిర్ణయించింది. బుధవారం నగరంలోని మెట్రో సర్వీసులన్నీ కిక్కిరిసిపోయాయి. మియాపూర్-ఎల్‌బీనగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్స్‌లో మూడు నిమిషాల 40సెకన్లకు ఒక రైలు, నాన్‌పీక్‌లో నాలుగు నిమిషాల 50 సెకన్ల కు ఒక రైలు నడిచేది. ఇప్పుడు నాలుగు నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు చొప్పున రోజంతా నడపనున్నారు. ఇకపోతే నాగోల్-రాయదుర్గ్ కారిడార్‌లో సాధారణంగా నాన్ పీక్‌లో ఐదు నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు నడిచేది. ఇప్పుడది మూడు 40 నిమిషాలకు ఒక రైలును నడపాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా సర్వీసులు పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు మెట్రో ఎండీ ప్రకటించారు.

**సీఎం స్పందించాలి: జేఏసీ**

గన్‌పార్క్ వద్ద జేఏసీ నేతలు ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి,రాజిరెడ్డి, వీఎస్ రావు, రవీందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ”సమ్మె దీర్ఘకాలంగా కొనసాగకుండా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి. 31 డిమాండ్ల విషయంలో సానుకూలంగా చర్యలు తీసుకోవాలి. సమ్మె చట్టవిరుద్ధం కాదు. చట్టబద్ధం. రాజ్యాంగం కల్పించింది. సీఎం, మంత్రులు, ఆర్టీసీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. బెదిరింపులు సరికాదు. అనివార్యమైన పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్లాల్సి వచ్చింది” అని అన్నారు.

**సమ్మె విరమించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.సమస్యకు సమ్మె పరి ష్కారం కాదన్నారు కార్మికుల సమస్య పరిష్కా రానికి కమిటీ వేసినట్టు తెలిపారు. నాలుగు వారా ల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించి నట్టు చెప్పారు. 32 అంశా ల్లో 29 సమస్యలు వెంటనే పరిష్కారం చేయదగి నవనీ, ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికల అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ విషయాలపై సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని వివరించారు. ఆర్టీసీ సమ్మె విషయంలో కార్మికులను హరీశ్‌రావు రెచ్చగొట్టారని విమర్శించారు. మహాలక్ష్మి పథకాన్ని అప్రతిష్ట పాల్జేస్తు న్నారని గుర్తుచేశారు. ఆర్టీసీ కార్మికులకు 2013 బాండ్లు రూ.280 కోట్ల వరకు, 1134 మందికి కారుణ్య నియామ కాలు చేసినట్టు వివరించారు. ప్రభుత్వం నెలకు రూ.300 కోట్లు అవసరమైనప్పుడు రూ. 400 కోట్లు ఇస్తున్నద న్నారు. అవసరమైతే ఎంతైనా ఇవ్వడానికి సిద్ధమేనని గుర్తుచేశారు. సమ్మెకు నాయకత్వం వహించేవారు, ఉద్యోగాలు చేయనివారు, రిటైరైన వారు ఉన్నారని చెప్పారు. రాజకీయ దురుద్దేశంతోనే కార్మికులను రెచ్చగొట్టారని వ్యాఖ్యానిం చారు. డిప్యూటీ సీఎం చెన్నైలో ఉండటంతో మాట్లాడలేక పోయామని చెప్పారు. అధికారుల సంప్రదింపులు కొనసాగు తుండగానే కార్మిక నేతలు సమ్మెలోకి వెళ్తతామని చెప్పుకుంటూ చర్చల నుంచి వెళ్లిపోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం యూనియన్లను రద్దుచేసినప్పుడు ఎందుకు అడగలేదని ప్రశ్నించారు.

# ఎలాంటి చర్యలొద్దు

మొదటిపేజీ తరువాయి

ఈ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావుతో పాటు మరో ఇద్దరిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. విచారణ కమిషన్ చట్టం కింద నిర్దేశించిన సరైన ప్రక్రియను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.కాళేశ్వరం ప్రాజెక్టుపై ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎస్ ఎస్.కె. జోషి, ప్రస్తుత ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ కమిషన్ చట్టంలోని సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయలేదని, తమ వాదనలు వినకుండానే కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేస్తూనే, ప్రస్తుత నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ తన నివేదికను 2025 జులై 31న ప్రభుత్వానికి సమర్పించింది. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలకు కేసీఆర్, హరీశ్ రావు సహా అధికారులను బాధ్యులను చేస్తూ నివేదికలో పేర్కొంది.పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ కౌన్సిల్ దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి, కమిషన్ తరపున సీనియర్ కౌన్సిల్ ఎస్. నిరంజన్ రెడ్డి వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా నలుగురు పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు ప్రారంభించవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# కాల్పుల విరమణ పొడిగింపు!

మొదటిపేజీ తరువాయి

ఇక మరోవైపు, ఒప్పందం కుదరకపోతే మళ్ళీ పోరు తప్పదని ఉభయ పక్షాలు హెచ్చరించాయి. గడువులోగా ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై బాంబుల మోత తప్పదని ట్రంప్ పేర్కొనగా, అమెరికా గనుక మళ్ళీ యుద్ధం మొదలెడితే పశ్చిమాసియా చమురు పరిశ్రమను నాశనం చేస్తామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) సీనియర్ కమాండర్ ఒకరు హెచ్చరించారు. ఇరాన్‌పై దాడికోసం తమ భూభాగాలను అమెరికా ఉపయోగించుకునేందుకు దక్షిణాది పొరుగుదేశాలు శత్రువును అనుమతిస్తే ఇక వారు చమురు ఉత్పత్తికి బై బై చెప్పుకోవాల్సిందేనని ఆ కమాండర్ హెచ్చరించారు.

ఇదిలా వుండగా, రెండో దఫా చర్చల కోసం అమెరికా, ఇరాన్‌లను ఒక చోటకు చేర్చేందుకు పాకిస్తాన్ తిప్పలు పడుతోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సహా నేతలందరూ ముమ్మరంగా కృషి చేస్తున్నారు. ట్రంప్ కాల్పుల విరమణ ప్రకటించగానే పాక్ అభ్యర్ధనను మన్నించినందుకు షరీఫ్ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ ప్రకటనతో దౌత్య ప్రయత్నాలు కొనసాగుతాయని వ్యాఖ్యానించారు. ఇలా చర్చల కోసం పాక్ అంతా సన్నద్ధం చేసుకుంటుండగా, చర్చల్లో పాల్గొనాలా వద్దా అనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ పేర్కొంది. అమెరికా అనామోదయోగ్యమైన చర్యల కారణంగా చర్చలపై తాము తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై ప్రభుత్వ టివితో చెప్పారు. దీంతో అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నేతృత్వంలో ప్రతినిధి బృందం జరపాల్సిన ఇస్లామాబాద్ పర్యటనను వైట్‌హౌస్ నిలువరించింది.

## హోర్మూజ్‌ను దాటేందుకు యత్నం ఇరాన్ అధీనంలోకి రెండు నౌకలు మూడో దానిపై కాల్పులు

ఆంక్షలు కొనసాగుతున్నా హోర్మూజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన మూడు కంటెయినర్ నౌకలను ఇరాన్ బలగాలు లక్ష్యంగా చేసుకున్నాయి. వాటిల్లో రెండు నౌకలను తమ అధీనంలోకి తెచ్చుకున్నామని, మూడో దానిపై కాల్పులు జరిపామని ఇరాన్ గార్డులు ప్రకటించారు. ఒమన్ తీర ప్రాంతంలోని కంటెయినర్‌పై ఇరాన్ గన్‌బోట్లు బుధవారం కాల్పులు జరిపిన విషయాన్ని బ్రిటీష్ మారిటైమ్ సెక్యూరిటీ సంస్థ కూడా పేర్కొంది. ఇరాన్ తీరానికి సమీపంలో వున్న నౌకపై కూడా కాల్పులు జరిగాయని తెలిపింది.

విడిగా జరిగిన మరో సంఘటనలో హోర్మూజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన రెండు నౌకలను ఇరాన్ తీర ప్రాంత జలాల్లోకి మళ్ళాల్సిందిగా ఆదేశించినట్లు ఐఆర్‌జిసి తెలిపింది. వాటిల్లో ఒకటి లైబేరియా పతాకంతో వున్న నౌక గుజరాత్‌లోని ముందా పోర్ట్‌కు వెళ్ళాల్సి వుందని పేర్కొంది.

## ఆహార సరఫరాపై ఎలాంటి ప్రభావం లేదు

తమ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధనాన్ని అమలు చేస్తున్నా దాని ప్రభావం ఆహార సరఫరాపై లేదని ఇరాన్ వ్యవసాయ మంత్రి ఘోలామ్రెజా నూరి చెప్పారు. తమ ప్రజలకు మౌలిక సరుకులు అన్నీ అందుబాటులో వున్నాయని, ఇందుకు పటిష్టంగా వున్న దేశీయ ఉత్పత్తి, ప్రత్యామ్నాయ దిగుమతి మార్గాలు కారణమని పేర్కొన్నారు. 85శాతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ దేశీయంగానే తయారవుతాయని అందువల్లే దేశ ఆహార భద్రత భద్రంగా వుందని అన్నారు.

## ఇజ్రాయిల్-లెబనాన్ చర్చలు

ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య చర్చలు పునరుద్ధరించబడాల్సి వుందని హిజ్బుల్లా పేర్కొంది. గత శుక్రవారం పదిరోజుల కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుండి ఇజ్రాయిల్ తరచుగా దారుణమైన ఉల్లంఘనలకు పాల్పడుతోందని హిజ్బుల్లా విమర్శించింది. ఈ ఉల్లంఘనల్లో పౌరులపై కూడా దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. గ్రామాలకు గ్రామాలు నేలమట్టమవుతున్నాయని విమర్శించింది. తాము కూడా మొదటిసారిగా ఇజ్రాయిల్ బలగాలపై రాకెట్లు, డ్రోన్లు ప్రయోగించామని తెలిపింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 23 ఏప్రిల్ 2026

## 8వేల కోట్ల ఫీజుల బకాయిలు విడుదల చేయాలి



**ప్రజావినికిడి, (అంబర్ పేట్):**
విద్యార్థులకు రావలసిన 8 వేల కోట్ల ఫీజుల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బిసి విద్యార్తి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్ అన్నారు. ఈ మేరకు వందలాది మంది విద్యార్థులు విద్యానగర్ లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మోదీరాందేవ్, తెలంగాణా బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీంరాజ్ నాయకత్వంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ, విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ముఖ్యమంత్రి లక్షల కోట్ల కుంభకోణాలు చేస్తున్నారని విమర్శించారు. పేద విద్యార్థులు స్కాలర్ షిప్పులు, ఫీజులు బకాయిలు రాక ఆత్మహత్యలు చేసుకుంటే సీఎం, అతని సోదరులు, మంత్రులు వేల కోట్ల రూపాయల అవినీతి కుంభకోణాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని అన్నారు. బీసీ, ఎస్సీ,ఎస్టీలు చదువుకుంటుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓర్వలేకపోతున్నారు. ఇంత దారుణంగా దిగజారిన ముఖ్యమంత్రి గతంలో ఎవ్వరూ లేరన్నారు. ఫీజులు బకాయిలు ఇవ్వకపోతే "రేవంత్ హటావో-తెలంగాణకు బచావో" ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానంలో ఇచ్చిన విధంగా విద్యార్థులకు రావాల్సిన మొత్తం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలి,విద్యా భరోసా కార్డు ఐదు లక్షలు,నిరుద్యోగ భృతి 4వేలు, యువతకు స్కూటీలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని లేని యెడల బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన, రాస్తారోకో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు

## వేసవి సెలవులను మంచి పనులకు ఉపయోగించండి

**చంద్రుపట్ల పాఠశాల సమావేశంలో ఎస్సై కృష్ణప్రసాద్**



**వాజేడు, ఏప్రిల్ 23,(ప్రజావినికిడి):** ఎంపియుపిఎస్ చంద్రుపట్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సంతోష్ అధ్యక్షతన నిర్వహించిన పిటీఎం సమావేశానికి పేరూరు ఎస్సై కృష్ణ ప్రసాద్, ముఖ్యఅతిగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులలో ప్రమాదాలకు గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బాల్యం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని అందుకు తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అదేవిధంగా సమావేశానికి విచ్చేసిన యువతను ఉద్దేశిస్తూ వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మద్యం తాగుతూ వాహనాలు నడపవద్దని సూచించారు. టెన్త్ నుండి డిగ్రీ వరకు చదువుకున్న యువత ఆల్కహాల్ గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ప్రభుత్వ ఉద్యోగాల కోసం గాని ప్రైవేట్ కంపెనీలు నిర్వహిస్తున్న జాబు మేళాకు గానీ హాజరై ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని కుటుంబానికి ఆర్థికంగా ఆసరాగా ఉండాలని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుముల సంధ్యారాణి నవీన్ పాఠశాల ఉపాధ్యాయులు బిక్షపతి,నజీం బాబా,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గట్టి లలిత,వార్డు సభ్యుడు తొంగలి సత్యనారాయణ, పేరెంట్స్ బగుతు రాజేంద్రప్రసాద్, కవి రాజు,దుర్గం నవీన్,యూత్ సభ్యులు,పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారుద

## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది :ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



**బాధిత తండ్రి సంతోష్ ఆనంద్ కు ఆరు లక్షల రూపాయల ఎల్.ఓ.సీ.ఆందజేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి**

**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని అనిత నగర్ కాలనీ నందు నివాసం ఉండే సంతోష్ ఆనంద్ కూతురు శ్రీసిద్ది (18 నెలలు) పుట్టుకతో చెవి వినికిడి సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి ని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిదికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి గాను వారికి 6,00,000(ఆరు లక్షల రూపాయలు)ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది. ఈ సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుంది అని అన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని అన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు సామ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళిత కుటుంబం పై మేడిపల్లి పోలీసుల జులుం..

### అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న పోలీసులు..

### మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్లో ఉద్యోగం చేస్తున్నానని సామాన్యులపై సంధ్య దౌర్జన్యం..








**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఎస్సై వీరబాబు తీరుపై న్యూ శ్రీరామ్ నగర్ కాలనీవాసుల నుండి తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ సంధ్య, ఆమె భర్త కానిస్టేబుల్ పాండు పార్కింగ్ విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీ నివాసులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతూ, దళితులని కులం పేరుతో బూతు పదాలతో దూషించడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని బాధితులు వాపోతున్నారు.

### మైనర్ బాలుడిపై కిడ్నాప్ యత్నం ఆరోపణలు

అత్యంత సంచలనంగా మారిన అంశం ఏమిటంటే కమిషనరేట్ లో పనిచేస్తున్న సంధ్య ఫిర్యాదు నేపథ్యంలో ఒక మైనర్ బాలుడిని ప్రైవేట్ వాహనంలో కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపణలు రావడం. ఈ ఘటనలో ఎస్సై వీరబాబు, కానిస్టేబుల్ చారి పాత్రపై తీవ్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బాలుడిని కారులోకి బలవంతంగా ఎక్కించేందుకు యత్నించి, అతనిపై దాడికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దానితోపాటు అసభ్య పదజాలాలతో బాలుడిని దూషించారని స్థానికులు పేర్కొన్నారు.

### పోలీసులే భయంకరంగా మారారని బాధితుల ఆవేదన

"రక్షకులుగా ఉండాల్సిన పోలీసులు భక్షకుల్లా మారారు" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో నివసించే సాధారణ ప్రజలను బెదిరిస్తూ, మహిళలు,పిల్లల పట్ల కూడా అత్యంత భయంకరంగా, అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తున్నారు. సంఘటన సమయంలో బాలుడిని కొట్టడం, దళితులని బూతులు తిట్టడం వంటి ఘటనలు స్థానికులను షాక్‌కు గురి చేశాయి.

### ఫిర్యాదు స్వీకరించని పోలీసులు

ఈ ఘటనపై ఫిర్యాదు చేయడానికి రాత్రి సమయంలో స్టేషన్‌కు వెళ్లినప్పటికీ,ఎస్సై వీరబాబు ఫిర్యాదు స్వీకరించలేదని బాధితులు చెబుతున్నారు. "న్యాయం కోసం వెళితే మమ్మల్ని తిరస్కరించారు" అంటూ వారు వాపోయారు. ఇలాంటి కొంతమంది అధికారుల వలన పూర్తిస్థాయిలో పోలీస్ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అంటున్నారు.

### భయభ్రాంతులకు గురవుతున్న న్యూ శ్రీరామ్ నగర్ ప్రజలు..

న్యూ శ్రీరామ్ నగర్ ప్రాంతంలో నివసించే కానిస్టేబుల్ పాండు, అతని భార్య సంధ్య ఫిర్యాదుతో ఈ ఘటనలు మరింత ముదిరాయని తెలుస్తోంది. దానితో పాండు సంధ్య అంటే బస్తీలో ఒక భయం ఏర్పడిందని బస్తీ వాళ్లను కొట్టడం, భయాందోళనకు గురి చేయడం అధికార దుర్వినియోగానికి పాల్పడడంతో పాటు వ్యక్తిగత ద్వేషంతో బస్తీ ప్రజలను టార్గెట్ చేసి పోలీసులను ఉపయోగించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్

న్యూ శ్రీరామ్ నగర్ లో కమిషనరేట్ లో డ్యూటీ చేసే సంధ్య, ఆమె భర్త పాండు ఇద్దరు పోలీసు లు కావడంతో బస్తీ వాసులపై అధికార దుర్వినియోగానికి పాల్పడి మైనర్ బాలుని కిడ్నాప్ చేయడానికి ఎత్నించి, దాడులకు, దుర్భాషనలకు కారణమైన ఈ ఘటనపై కమిషనర్ స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి,దళితులైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కమిషనర్‌ను కోరుతున్నారు. ఎస్సై వీరబాబు, కానిస్టేబుల్ చారి, అలాగే సంధ్య,పాండు పై విచారణ జరిపి, అవసరమైతే ఉద్యోగాల నుంచి తొలగించాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

### బాధితులకు న్యాయం జరిగేనా.?

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ అమానుషియమైన ఘటన పోలీస్ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సినవారే దౌర్జన్యానికి దిగితే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# మహాత్మ జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ సి. నారాయణ రెడ్డి









**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
హాస్టళ్లు అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా,అన్ని ఎస్సీ/ఎస్టీ/బీసీ/మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు మరియు రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతుల కోసం 3వ రోజును పాటించడం జరిగింది. దీని ప్రకారం,అన్ని సంస్థలు తనిఖీలు నిర్వహించి, హాస్టళ్లలోని భవనాలు, పారిశుధ్యం,నీటి సరఫరా,విద్యుత్ పరికరాలు, వంటగది, టాయిలెట్ బ్లాక్‌లు,స్నానాల గదులు ఇతర ప్రాథమిక సౌకర్యాలకు సంబంధించిన చిన్నపాటి మరమ్మతుల అవసరాలను గుర్తించాయి. ఈ పనులను నమోదు చేసి,అమలు చేయడానికి ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించడం జరిగింది. ప్రభుత్వ భవనాల విషయంలో, అవసరమైన అంచనాలను సిద్ధం చేసి ఆమోదం కోసం సమర్పించడం జరుగుతోంది. ఈ పనులను వేసవి సెలవుల సమయంలో చేపట్టడం జరుగుతుంది. ప్రైవేట్ భవనాల విషయంలో, 24.04.2026 నుండి అవసరమైన మరమ్మతు పనులను చేపట్టేందుకు భవన యజమానులతో సమన్వయం చేసుకోవాలని సూచనలు జారీ చేయబడ్డాయి. విద్యార్థులకు మరియు విద్యా కార్యకలాపాలకు కనీస అసౌకర్యం మరియు ఎటువంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు,అన్ని మరమ్మతు పనులను వేసవి సెలవుల్లోనే పూర్తి చేయడానికి ప్రణాళిక చేయబడింది. "హాస్టళ్లు అదేవిదంగా రెసిడెన్షియల్ పాఠశాలల్లో చిన్నపాటి మరమ్మతులు" అనే 3వ రోజు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందిఆయా హాస్టళ్లు రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థుల ఇబ్బందులను నివారించేందుకు, మౌలిక సదుపాయాలు అలాగే సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చిన్నపాటి మరమ్మతు పనులను సకాలంలో చేపట్టేందుకు చర్యలు ప్రారంభించబడ్డాయి..
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) కె.శ్రీనివాస్ తో కలిసి మహేశ్వరం మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు.
సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.
బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా మహేశ్వరం మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) కె.శ్రీనివాస్ తో కలిసి సందర్శించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలలో వసతి గృహాలలో నెలకొన్న సమస్యలతో పాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలలో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని,మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అనంతరం వంటశాల, పాఠశాలలోని వంటగది,మెస్ మరియు పరిసరాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల నుంచి ఆహారం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల నందు ఎంసెట్ పరీక్షలు వ్రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందిస్తున్న కోచింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా వ్యవస్థలో అనేక మార్పులు రావడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థులు ఉన్నతస్థాయి చేరుకునేలా మీరంతా విద్యను బోధించాలని, మీ విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉండే విధంగా తీర్చిదిద్దాలన్నారు. మీరు ఉత్తమ పౌరులుగా, ఉన్నతస్థాయిలో ఉండే విధంగా, ఉపాధ్యాయునిగా తృప్తి చెందేలా బోధన చేయాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి చాలా ఉత్తమమైనదని, రాబోయో తరాలను మంచి పౌరులుగా తీర్చిదిద్దే వృత్తిలో ఉన్నందున మంచి బోధనను అందించాలని, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి కేషు రామ్, తహశీల్దార్, మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు -కూలీల గొంతుక ఏ.ఐ.కే.ఎం.ఎస్.

## ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా మహాసభలలో రాష్ట్ర అధ్యక్షులు వి. కోటేశ్వరరావు





**నల్గొండ: ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కే.ఎం.ఎస్) నల్లగొండ జిల్లా 11వ మహాసభ శాలి గౌరారం మండల పరిధి ఇటుకల పహాడ్ గ్రామంలో జరిగాయి. మహాసభకు ముందుగా రైతు -కూలీ సంఘం అరుణ పతకాన్ని జిల్లా అధ్యక్షులు జ్వాల వెంకటేశ్వర్లు ఆవిష్కరణ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి రైతు -కూలీ ఉద్యమంలో అమర వీరులకు సంతాప తీర్మానం ప్రవేశపెట్టడంతో ప్రతినిధులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ మహాసభకు ముఖ్య అతిధిగా ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వి. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ..దేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పాలకులు విస్మరించారని అన్నారు. దేశానికి అదికార మార్పిడి జరిగి 79ఏండ్లవుతున్న నేటికీ రైతు పండించిన పంటకు మద్దతు ధర లేదని అన్నారు. రైతు పండించిన పంటకు రైతే ధర నిర్ణయించే హక్కు కోసం ఏ.ఐ.కే.ఎం.ఎస్ పోరాడుతుందని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మధ్య దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రైతులు కొనుగోలు చేస్తున్న ఉత్పదక (ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్లు) ధరలకంటే పండించిన పంటకు తక్కువ ధర ఉన్నదని అన్నారు. అతిపెద్ద పారిశ్రామిక వేత్త అదానీ ఆదాయం ఒకే రోజుకి



16వందల కోట్లు ఉన్నదని, కష్టపడే రైతుకు మాత్రం ఆత్మహత్యలే మిగులు తున్నాయని అన్నారు. సామ్రాజ్యవాద విత్తన పరిశ్రమలు రైతులను దోపిడి చేస్తున్నాయి అన్నారు. రైతు-కూలీల కుటుంబాలు దివాలితీసి కుటుంబ పోషణ భారంగా ఉన్నదని అన్నారు. భూమిలేని నిరుపేదలందరికి భూ పంపిణి జరగాలని అన్నారు. భారత దేశంలో భూ సంస్కరణలు జరగాలని అన్నారు. మనదేశంలో ఉన్న సంపదను సామ్రాజ్యవాద దేశాలు తరలించుకు పోతున్నదని అన్నారు.ఏ.ఐ.కే.ఎం.ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్ మాట్లాడుతూ.. అఖిల భారత రైతు -కూలీ సంఘం పీడిత ప్రజల తలలో నాలుకలా మేగిలిందని అన్నారు. ఎర్రజెండా పేదలకు లక్షల ఎకరాల భూమిని పంచిందని అన్నారు. దున్నేవానికే భూమి అనే నినాదంతో పోరాటాలు జరిగాయని, యానాల మల్లారెడ్డి, పలస బిక్షం, బూరుగు అంజయ్య, తోట సోమయ్య లాంటి అనేక మంది పీడితులను ఏకంచేసి విప్లవాగ్ని రగిలించారని అన్నారు. నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతు నల్లచట్టాలను, విత్తన, విద్యుత్ చట్టాలను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని అన్నారు. దేశంలో అనేక మంది చేతిలో పనిలేక వలసలు వెళుతున్నారనీ. 2005లో వలసలను నివారించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం తీసుకువచ్చిందని, 16కోట్లకు పైగా పేదలు ఉపాధి హామీ పనులకు వెళుతున్నారని, నేడు బీజేపీ ప్రభుత్వం పాత చట్టాన్ని ఎత్తివేసి వి బి జీ రాం జీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై అదారపడే విధంగా మార్చిందని అన్నారు. పేదల శ్రమను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టే మోడీ ప్రభుత్వ దివాలకోరు విధానాలపై రైతు -కూలీ ఉద్యమాలను తీవ్రం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభ గత ఉద్యమాలను సమీక్షించింది, భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించుకొన్నది. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సిలువేరు జానయ్య, కోశాధికారి గజ్జి రవి, జిల్లా నాయకులు వేముల శంకర్, అంబటి కృష్ణ మూర్తి, అంబటి నర్సయ్య, కల్లూరి అయోధ్య, బీరెడ్డి సత్తిరెడ్డి, కుంభం వెంకటేశం, బూరుగు సత్తయ్య, పజ్జూరు ఉపేంద్ర, బి వి చారి, పోలె పవన్, మామిడోజు వెంకటేశ్వర్లు, రావుల లింగయ్య, అంబటి మహేష్, జయరాజ్, యాదమ్మ, సుజాత, శైలజ, సునీత, పుష్ప, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ సంఘీభావం



**వరంగల్, (ప్రజావినికిడి):**
వరంగల్ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం నిర్వహించబడిందిఈ కార్యక్రమాన్ని వరంగల్ జిల్లా నాయకులు, అడ్వకేట్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర రాము గౌడ్ ఆర్టీసీ కార్మికులను ప్రత్యక్షంగా కలుసుకుని,వారి సమస్యలను తెలుసుకుని సంఘీభావం తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆర్టీసీ కార్మికులు ప్రజా రవాణా వ్యవస్థకు ఆధారం. వారి న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.జిల్లా నాయకులు అడ్వకేట్ రామకృష్ణ మాట్లాడుతూ,కార్మికుల హక్కుల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుంది. ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చూపుతున్న నిర్లక్ష్య వైఖరిని పార్టీ తీవ్రంగా ఖండించింది. కార్మికుల డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తుల కోటేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు



**రాజేంద్ర నగర్,(ప్రజావినికిడి):**
రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన సమ్మెలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, పీఆర్ సీ వేతనాలను వెంటనే రిలీజ్ చేయాలని,ఆర్టీసీ యూనియన్ కు అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మె వల్ల రోజువారి ప్రయాణికులకు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుందని హేమ సుదర్శన్ జిల్లోజు అన్నారు.

# ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధి

## అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయండి -అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు

**హైదరాబాద్,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీలు, హాస్పిటళ్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. భారత సంప్రదాయ వైద్య సేవలకు ప్రాచుర్యం కల్పించి, ప్రజలకు ఉపయోగపడేలా ఆయుష్ డిపార్ట్‌మెంట్ పనివిధానం ఉండాలని మంత్రి సూచించారు. ఓపీ, ఐపీ పేషెంట్ల సంఖ్య మరింత పెరగాలన్నారు. అవసరమైన చోట డాక్టర్లు, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. సిద్దిపేట, వికారాబాద్, భూపాలపల్లిలోని ఇంటిగ్రేటెడ్ ఆయుష్ హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.ఆయుష్ మెడిసిన్ సప్లైలో గ్యాప్ ఉండకూడదని, పేషెంట్లకు అవసరమయ్యే అన్నిరకాల మందులు అందుబాటులో



ఉంచాలని సూచించారు.ప్రభుత్వ ఆయుర్వేద, హోమియోపతి డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను స్ట్రిక్ట్‌గా మానిటర్ చేయాలని మంత్రి ఆదేశించారు. డ్యూటీలకు గైర్హాజరయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.
సరియైన అనుమతులు, అర్హతలు లేకుండా, ఆయుర్వేద, హోమియోపతి తదితర హాస్పిటళ్లు, క్లినిక్‌లు నడిపిస్తూ, తప్పుడు ప్రకటనలతో ప్రజలను దోచుకుంటున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబును మంత్రి ఆదేశించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఆయుర్వేద, హోమియోపతి తదితర పేర్లతో నడుస్తున్న క్లినిక్‌లు, హాస్పిటళ్లను తనిఖీ చేయాలని, అవసరమైన అనుమతులు లేని హాస్పిటళ్లపై చర్యలు ప్రారంభించాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలపై నేచర్‌క్యూర్ హాస్పిటల్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం సమీక్ష చేశారు.ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆయుష్ హాస్పిటల్స్, క్లినిక్‌లు, కాలేజీలు, తదితర అంశాలను మంత్రి ఆరా తీశారు.

# గవర్నర్ ను కలిసిన దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి

## సరస్వతీ అంత్య పుష్కరాలకు గవర్నర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**




దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎన్. హనుమంతరావు లు బుధవారం లోక్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిసి రానున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాలు (జూన్ 26 నుంచి జూలై 7, 2027 వరకు), సరస్వతి అంత్య పుష్కరాలు (మే 21 నుంచి జూన్ 1, 2026 వరకు) నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి గవర్నర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పుష్కరాలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. భక్తుల వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్ చర్యలు, ముఖ్య ఆలయాలు?వాటి ప్రాధాన్యత, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై గవర్నర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిశోర్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ బుధవారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

------------

# నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును వేగంగా ఢీకొన్న కారు

## ముగ్గురు దుర్మరణం




**నల్గొండ,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
నల్లగొండజిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు.. బైకును ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శాకాజిపురానికి చెందిన బాల్‌రెడ్డి, అలివేలు, పాల్వాయి గ్రామానికి చెందిన మంజుల, వెంకటమ్మ నల్గొండలో జరిగిన ఓ శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. వద్దిరెడ్డిగూడెం సమీపంలో అతి వేగం కారణంగా కారు ప్రమాదానికి గురైంది. ఓ బైకును ఢీకొట్టి కారు అదుపుతప్పింది. ఆ వెంటనే ఓ చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న కనగల్‌కు చెందిన మధుబాబు, ధనుంజయ అక్కడికక్కడే చనిపోయారు. కారులో ఉన్న బాల్‌రెడ్డి కూడా సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. స్థానికులు ప్రమాదం గురించిన సమాచారాన్ని పోలీసులకు అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్ష బీభత్సం

## ములుగు, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు , వడగళ్ల వాన తీవ్ర బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా తెలంగాణలోని ములుగు, ఏపీలోని నంద్యాల జిల్లాలో కురిసిన వానకు సామాన్య ప్రజలతో పాటు రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడు మండలాల్లో భారీగా వడగళ్ల వాన కురిసింది. గాలుల ధాటికి పలు గ్రామాల్లో ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరిపోయాయి. ప్రజలు భయంభ్రాంతులకు గురయ్యారు. ఏటూరునాగారం – కమలాపూర్ మార్గంలో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా, పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చేతికి వచ్చే దశలో ఉన్న మిర్చి, వరి పంటలు వడగళ్ల వానకు దెబ్బతినడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. నంద్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలివాన ధాటికి వందల ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలపాలు కావడంతో రైతులు భారీగా నష్టపోయారు. రుద్రవరం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆకస్మిక వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నేలకూలిన విద్యుత్ తీగలు, స్తంభాలతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. వాటిని తాకవద్దని అధికారులు సూచించారు. పంట నష్టపోయిన రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలిపాలని, ప్రభుత్వం నుంచి అందే సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. రాబోయే కొన్ని గంటల్లో మళ్లీ వర్ష సూచన ఉన్నందున సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.



# త్రిస్సూర్ బాణాసంచా పేలుడు ఘటన

## రాష్ట్రవిపత్తుగా ప్రకటించిన ప్రభుత్వం

**తిరువనంతపురంఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
కేరళలోని త్రిస్సూర్ లో బాణా సంచా పేలుడు ఘటనను విజయన్ ప్రభుత్వం బుధవారం రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. ఈ ఘటనను రాష్ట్ర విపత్తుగా కేరళ మంత్రివర్గం బుధవారం విపత్తు నిర్వహణ అథారిటీని ఆదేశించింది. ఈ ప్రమాదంపై న్యాయవిచారణకు ఆదేశించింది. జస్టిస్ సి.ఎన్. రామచంద్రన్ నాయర్ నేతృత్వంలో న్యాయ కమిషన్ పర్యవేక్షించనుంది. మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల అత్యవసర ఆర్థిక సహాయం అందించనున్నట్లు విజయన్ ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నుండి రూ.4 లక్షలు, సిఎం విపత్తు సహాయ నిధి (సిఎండిఆర్ ఎఫ్)నుండి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపింది. గాయపడిన వారికి ఎస్ డిఎంఎ నిధి కింద కేటాయించిన మొత్తాన్ని ఇవ్వనున్నారు. అదనంగా సిఎండి ఆర్ ఎఫ్ నుండి రూ.2లక్షలు అత్యవసర ఆర్థిక సహాయం కింద అందించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గాయపడిన వారి చికిత్స ఖర్చులను ఆరు నెలల పాటు ప్రభుత్వం భరించనున్నట్లు తెలిపింది. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా సిఎండిఆర్ఎఫ్ నుండి కేటాయిస్తారు. అదనంగా, విపత్తు ప్రతిస్పందన నిధి నుండి అనుమతించబడిన మొత్తాన్ని వైద్య సహాయంగా అందిస్తారు. ఒకవేళ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం చికిత్స అవసరమైతే, సిఫార్సు చేయబడిన ప్రైవేట్ ఆసుపత్రులలోని చికిత్స ఖర్చులను వైద్య మండలి నిర్ణయం ఆధారంగా సీఎండీఆర్ఎఫ్ నుండి కేటాయించనున్నట్లు వెల్లడించింది. ప్రమాదం అనంతరం గాలింపు, సహాయక చర్యలను సులభతరం చేసేందుకు ఆ ప్రాంతంలోని ప్రైవేట్ గోడలను కూల్చివేయడంతో పాటు వరి పొలాలను చదును చేసి పూడ్చివేయాల్సి వచ్చింది. గోడల పునరుద్ధరణ కోసం అయ్యే ఖర్చును, రైతులకు పరిహారాన్ని జిల్లా కలెక్టర్ సిఫార్సు ఆధారంగా విపత్తు ప్రతిస్పందన నిధి నుండి కేటాయించనున్నారు. మృతదేహాలను ఖననం చేయడానికి మరియు డిఎన్ ఎ పరీక్షల కోసం నమూనాలను సేకరించేందుకు ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని జారీ చేయాలని ఎస్ డి ఎం ఎ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీకి సూచించింది. పేలుడు కారణంగా సమీపంలోని నివాసాలకు జరిగిన నష్టంపై తక్షణమే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించింది. ఎస్ డి ఆర్ ఎఫ్ నుండి పరిహారం అందించాలని సూచించింది.

-------------------

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

## రైతులను ఆదుకోవాలంటూ చంద్రబాబుకు విఎస్ లేఖ

**అమరావతి,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి)::** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ? ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతులు దైన్యమైన స్థితిలో ఉన్నారని తెలిపారు. సుమారు 11 లక్షల ఎకరాలకు పైగా ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు చేశారని, గత సంవత్సరం పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు సరైన ధర లేకపోవడంతో రాష్ట్రంలో రైతులు మొక్కజొన్న సాగు వైపు వెళ్లారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బర్లి పొగాకు స్థానంలో ఇతర పంటలను ప్రోత్సహించిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు ధరలు పడిపోవడంతో మొక్కజొన్న సాగు సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా పెరిగిందని వివరించారు. రైతుకు ఎకరా మొక్కజొన్న సాగు చేసేందుకు సుమారు 40 వేల రూపాయలు ఖర్చు అవుతుందని, 30 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా అని తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, అధిక వర్షాలు, అకాల వర్షాలు, పెరిగిన సాగు ఖర్చులను తట్టుకొని రైతులు మొక్కజొన్న సాగు చేసినప్పటికీ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.2,400 లు మద్దతు ధర లభించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో మార్కెట్లో దళారులు మొక్కజొన్న ధరలను క్వింటాలుకు రూ.1400 నుండి రూ.1800ల మధ్య కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. మొక్కజొన్న పండించిన రైతులు ఎకరానికి రూ.20 వేల నుండి 30వేలు నష్టపోతున్నాడు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు అనివార్యంగా మధ్య దళారులకు అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి నెల రోజులు అవుతున్నా కేంద్రం నుండి ఎలాంటి స్పందనా రాకపోవడంతో ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న సిఎం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈలోగా కేంద్రం అనుమతి కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

-----------------

# అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లు

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ

**హైదరాబాద్,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి)::**




తెలంగాణలో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.148 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బ్రిడ్జిలు ఉన్నా అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారాయని కేబినెట్ దృష్టికి వచ్చింది. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్‌ఫ్రా అండ్ క్యాపిటల్ వర్క్స్ కేబినెట్ సబ్ కమిటీ బుధవారంసచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో సబ్ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సరైన ప్రతిపాదనలు ఉంటే త్వరితగతిన ఆమోదించాలని మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. జూన్ 8వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మార్గనిర్దేశం చేశారు. ప్రతి వారం పనుల పురోగతిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. టెండర్లు, పనుల నాణ్యతపై కఠిన పర్యవేక్షణ ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు.

-----

# నేడు తెలంగాణ కేబినేట్ భేటీ

## కాళేశ్వరం తదితర అంశాలపై చర్చించే అవకాశం

హైదరాబాద్,**ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**): నేడు తెలంగాణ కేబినేట్ భేటీ అవుతోంది. వివిధ అంశాలపై కేటినేట్లఓ చర్చించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు కేబినేట్‌లో చర్చించే అవకాశం ఉంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశం భేటీ అవుతోంది. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

-------------

# కాళేశ్వరం పై సీబీఐ విచారణకు సిద్ధమా

## నిజాయితీ ఉంటే ముందుకు రండి -బీఆర్ఎస్ నాయకత్వానికి మంత్రి పొంగులేటి సవాల్

**హైదరాబాద్,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అంశంపై హైకోర్టు 'క్లీన్ చీట్' ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా విమర్శించారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని, భారీ ఆర్థిక దోపిడీ, కమిషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక ప్రకటనలో ఆరోపించారు. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన



కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యతపై ఇప్పటికే తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, మేడిగడ్డ వంటి కీలక నిర్మాణాలు కుంగిపోవడం, పంప్ హౌజ్‌లు దెబ్బతినడం వంటి సంఘటనలు యాదృచ్ఛికం కాదని స్పష్టం చేశారు. ఇవన్నీ ప్రాజెక్టులో జరిగిన పెద్ద ఎత్తున అవినీతికి నిదర్శనాలేనని పేర్కొన్నారు. నాటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాల కారణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నాణ్యత దెబ్బతిందని, అదే విధంగా నిర్మించిన చెక్ డ్యాములు కూడా కుప్పకూలిన ఘటనలు ప్రజల ముందు ఉన్న వాస్తవాలేనని మంత్రి గుర్తు చేశారు.లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదన్నట్టుగా గ్లోబల్ ప్రచారానికి దిగడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, ఇది టీఆర్ఎస్ పాలనలో పెరిగిన మాయాజాల రాజకీయాలే అని విమర్శించారు. నిజాన్ని దాచేందుకు ప్రచార యంత్రాంగాన్ని వినియోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకత్వం, ముఖ్యంగా కేసీఆర్ మరియు కేటీఆర్ ఈ అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, విచారణ నుంచి ఎందుకు తప్పించుకుంటున్నారో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్ట్ పై పూర్తి స్థాయి పారదర్శక విచారణ జరగడం ప్రజాస్వామ్యంలో కనీస బాధ్యత అని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఖర్చు చేసిన ప్రతి రూపాయిపై లెక్క చెప్పాల్సిన రోజు దగ్గరలోనే ఉందని, ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. నిజం మీవైపు ఉంటే విచారణకు ముందుకు రావాలని లేకపోతే మీ భయం మీ తప్పును నిరూపిస్తుందన్నారు.

# పర్యాటక రంగంలో 'రివర్స్ టూరిజం'

**'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్**

**జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి**

**ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించిన మంత్రి**





**నిర్మల్,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):**
రాష్ట్ర పర్యాటక రంగ చరిత్రలో సరికొత్త ఒరవడికి నాంది పడింది. కేవలం నగరవాసులు ప్రకృతిని చూడటానికి పల్లెలకు వెళ్లడమే కాకుండా, అడవి బిడ్డలు సైతం ఆధునిక అభివృద్ధిని, చారిత్రక వైభవాన్ని కళ్లారా చూడాలన్న సంకల్పంతో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'రివర్స్ టూరిజం'కు శ్రీకారం చుట్టారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం గోండు గూడెంలో బుధవారం నిర్వహించిన 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్'ను మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు కొత్త అనుభవాలు ఇవ్వడం, నగర జీవన విధానం పరిచయం చేయడం, ఆత్మవిశ్వాసం పెంచడం, రెండు సంస్కృతుల మధ్య అవగాహన పెంచడం, సాంస్కృతిక మార్పిడి, అంతిమంగా ఆదివాసీల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి రూపకల్పన చేసినట్లు వివరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా, మంత్రి జూపల్లి స్వయంగా ఆదివాసీలతో కలిసి బస్సులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రయాణ పొడవునా వారితో ముచ్చటిస్తూ పర్యటన లక్ష్యాన్ని వివరించారు. 'బయటి ప్రపంచంతో అనుసంధానం కావడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లోని అభివృద్ధిని చూసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలి. ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలి. అప్పుడే ఆదివాసీల జీవన ప్రమాణాల్లో మార్పులు వస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివాసీల విశిష్ట సంస్కృతికి, నగర నాగరికతకు మధ్య ఈ కార్యక్రమం ఒక వారధిలా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. 5 ప్రత్యేక బస్సుల్లో బయలుదేరిన 250 మంది ఆదివాసీలు మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తారామతి బారాదరికి చేరుకుంటారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో విమానాశ్రయం, చార్మినార్, గోల్కొండ కోట, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే పాల్గొన్నారు. వీరితో పాటు డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్ తదితరులు పాల్గొన్నారు,

# రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్

## అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ప్లాంట్

## నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ లోని రెన్యూవబుల్ రంగంలో భారీ పెట్టుబడులతో ఎనర్జీ ప్లాంట్ స్థాపించేందుకు ప్రముఖ రెన్యూ ఎనర్జ్ గ్లోబల్ సంస్థ ముందుకొచ్చింది. క్లీన్ ఎనర్జీ రంగంలోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉన్న రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఇప్పటికే దేశంలో 19.2 గిగావాట్ల సామర్థ్యంతో వివిధ ప్రాంతాల్లో క్లీన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రముఖ స్థానంలో ఉంది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ 6 గిగా వాట్లకు పైగా ఉత్పత్తి సామర్థ్యంతో క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. దీంట్లో భాగంగా ఆ ప్లాంట్‌కు భూమి పూజ గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ చేయనున్నారు. మొత్తంగా రూ.5,400 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేయబోయే సంస్థకు భూమి పూజ చేపట్టడంతో అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కీలక అడుగులు పడనున్నాయి. డీకార్బనైజేషన్ రంగంలో ముందంజలో ఉన్న ఈ సంస్థ.. సుమారు రూ.4,200 కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతోంది. దీంతో పాటు మరో రూ.1,200 కోట్ల వ్యయంతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్ట్‌ను నిర్మించనుంది. ఈ రెండు ప్రాజెక్టులు వచ్చే రెండేళ్లలో పూర్తి కానున్నాయి. రెన్యూ సంస్థ నిర్మించే సోలార్ ఇంగాట్?వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యూవబుల్ పవర్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 2,100 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీంతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు లభించనున్నాయి. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీని భారీ ఎత్తున ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళు _న్నారు. ఇంధన రంగం బలోపేతమైతే పారిశ్రామిక, వ్యవసాయ, సేవా రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఏపీని రెన్యువబుల్ ఎనర్జీకి కేంద్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా




ముఖ్యమంత్రి అడుగులు వేస్తున్నారు. గతేడాది నవంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్టనర్ సమ్మిట్‌కు హాజరైన రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాష్ట్రంలో దశలవారీగా రూ.82,000 కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించింది. దీంట్లో భాగంగా అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఎనర్జీ ఎ÷-లాంట్ ఏర్పాటుకు పనులను ప్రారంభించనుండగా త్వరలోనే సుమారుగా రూ.22,000 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ రిన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో ఒకదాన్ని అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రక్రియ చేపట్టనుంది. 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడే 2015లో కళ్యాణదుర్గం లో విండ్ ప్రాజెక్ట్‌తో రాష్ట్రంలోకి రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ అడుగుపెట్టింది. 717 మెగావాట్ల విండ్, 60 మెగావాట్ల సోలార్ ఎనర్జీ సామర్థ్యంతో ఏపీలోని రెన్యూ ఎనర్జీ గ్లోబల్ ఎ÷-లాంట్లు ఇప్పటికే పని చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్రకు పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఆర్సెలార్ మిట్టల్, కాగ్నిజెంట్‌కు వంటి ప్రముఖ సంస్థలకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. టీసీఎస్ ఇప్పటికే కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ నెలలో అతిపెద్ద అంతర్జాతీయ పెట్టుబడి గూగుల్ సంస్థకు శంకుస్థాపన చేయనున్నారు. సాఫ్ట్ వేర్, ఎనర్జీ, స్టీల్, మెడ్ టెక్, ఫార్మా వంటి రంగాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే భోగాపురం ఎయిర్ పోర్టు త్వరలో అందుబాటులోకి రానుంది. మరోవైపు పర్యాటకంగా? ఆధ్యాత్మికంగా కూడా ఉత్తరాంధ్రలో అభివృద్ధి పెద్ద ఎత్తున చోటు చేసుకుంటోంది. ఉదయం 09.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి జెడ్.చింతువకు బయలుదేరి వెళతారు. 11.10 గంటలకు రెన్యూ గ్లోబల్ ఎనర్జీ సంస్థ శంకుస్థాపనలో కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమాన్ని ముగించుకుని మధ్యాహ్నం 02.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# ర్యాంకుల గోల విద్యార్థులపై ఒత్తిడి !

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** టీవీలు, పేపర్ల నిండా ర్యాంకుల గోల. మా వద్ద చదివిన వారికి ర్యాంకులే ర్యాంకులు అంటూ... ప్రకటనలు..1,2,3 ఇలా టీవీల్లో ఊదరగొడుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే...ర్యాంకుల గొడవలో పిల్లల్లో సృజనాత్మకతను దెబ్బతీస్తున్నారు. లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, పేద మధ్యత తరగతి వారిని మాయలో పడేస్తున్నారు. ఇంతపెద్ద దేశంలో ఇలాంటి చదువులు సాగుతున్నందుకు సిగ్గుపడాలి. ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా భ్రష్టు పడుతోంది. ప్రభుత్వ హాస్టళ్లు నానాటికి తీసికట్టుగా తయారవుతున్నాయి. విద్యార్థులకు సరైన తిండి దక్కడం లేదు. ఫుడ్ పాయిజనింగ్‌తో చస్తున్నారు. అయినా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. నానా రకాల పేర్లతో హాస్టళ్లు పెట్టి పిల్లలను ఘోష పెడుతున్నారు. ఇక ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు కట్టుకోలేనంత, తట్టుకోలేనంతగా ఉన్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. తల్లిదండ్రులు ధర్నాలు చేసినా, ఫీజలు భారం నుంచి తప్పించడం లేదు. జీవితమంటే చదువులు, మార్కులు, ర్యాంకులే అన్న విధంగా విద్యారంగం తయారయ్యింది. ప్రైవేట్ మాఫియాలో అసలు విద్య గంగలో కలసిపోతోంది. ర్యాకులే విజయానికి కొలమానాలుగా మారాయి. నేటి విద్యావిధానం మార్కులు, ర్యాంకుల చుట్టూనే తిరుగుతోంది. పిల్లల ప్రతిభను ఈ కొలమానంతో కొలవడం దారుణం. ర్యాంకుల వేటలో పిల్లల మానసిక ఒత్తిడిని పెంచుతున్నారు. ఇటీవలి కాలంలో విద్యార్థుల ఆత్మహత్యలు సామాజిక సమస్యగా మారింది. చదివేది, పరీక్షలు రాసేదీ విద్యార్థులైతే, వాటి ఫలితాల కోసం ఎదురు చూసేది, వారి భవితపై అంచనాలు పెంచుకునేది వారి తల్లిదండ్రులు. వారి ర్యాంకులతో వ్యాపారం చేసేది ఆయా విద్యాసంస్థలు. ఈ ఒత్తిళ్ల మధ్య చదువులు, ర్యాంకుల వాతావరణానికి తోడు రకరకాల ఆర్థిక, సామాజిక, వివక్షల వంటి అనేక కారణాలు విద్యార్థుల్లో విపరీతమైన మానసిక సమస్యలను సృష్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అంచనాల ను, విద్యాసంస్థల ఒత్తిళ్లను తట్టుకోలేక కుంగుబాటుతో, నిస్పహాయతతో కొందరు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా వచ్చిన ఇంటర్ ఫలితాల అనంతరం పదుల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరీక్షల్లో ఫెయిలైతే జీవితం ముగిసిపోయినట్లే అన్న భావనలో..ఆత్మహత్యలే శరణ్యమని భావిస్తున్నారు. జీవితంలో చదువు, కెరీర్ ఒక భాగం మాత్రమే. అని వారికి అవగాహన కల్పించడం లేదు. మంచిచెడుల విచక్షణను తెలియజెప్పడం లేదు. ఇంటర్ ఫలితాలు వచ్చాక ఇటీవల తెలంగాణలో ఒక్క రోజులోనే ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే, ఎపి లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాలొచ్చిన ప్రతిసారీ చిన్నారుల ఆత్మహత్యల




వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా ఫ్యాక్టరీలు ర్యాంకుల కోసం విద్యార్థులను యంత్రాల్లా మార్చుతున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల అంచనాలకు హద్దు లేకుండా పోతోంది. వారి అంచనాలను అందుకోలేక మరొకరితో పోల్చడాన్ని తట్టుకోలేక.. బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇవి కేవలం పిల్లల వ్యక్తిగత వైఫల్యాల ఫలితం కాదు. సమాజం, విద్యావ్యవస్థలోని లోపాలను ప్రతిబింబిస్తోంది. సుప్రీంకోర్టు సైతం ఇది వ్యవస్థాగత లోపానికి నిదర్శనం అని వ్యాఖ్యానించిందంటే.. పరిస్థితి తీవ్రత ఎంతగా వుందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల ఒత్తిడిలో వున్న పిల్లలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం ముఖ్యం. మార్కులు, ర్యాంకుల కోసమే పుట్టలేదన్న విషయం పిల్లల్లో నూరిపోయాలి. ఫెయిలైతే మళ్లీ చదువుకునేందుకు అవకాశం ఉంది. అసలు చదువే ఇష్టం లేకపోతే అభిరుచి వున్న మరో రంగంలో సత్తా చాటడానికి విశాల ప్రపంచం ఉంది. తరగతి గదిలో వెనకబడిన వారు జీవితంలో అద్భుతాలు సాధించిన ఘటనలు అనేకం చరిత్రలో వున్నాయి. సచిన్ టెండూల్కర్, ధోనీ వంటి ప్రముఖ క్రికెటర్లు

హైస్కూల్ చదువులతోనే సరిపెట్టుకున్నారు. ఇప్పుడు పేరున్న వారంతా అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎదిగినవారే. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయనో, పదిలో ఫెయిల్ అయ్యామనో తనువు చాలిస్తే భవిష్యత్‌లో దేశం ఒక గొప్పవ్యక్తిని కోల్పోయినట్టే. మన శ్రమతో కొత్త చరిత్రను లిఖించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే విద్యారంగంలో సంస్కరణలు ముఖ్యం. ర్యాంకుల గోల, ఫీజలు గోల పోయేలా ప్రభుత్వరంగంలో స్కూళ్లను, కాలేజీలను బలోపేతం చేయాలి. ఒకేతరహా విద్య అందరికీ అందేలా చేయాలి. ముఖ్యమంగా ప్రైవేట్ స్కూళ్ల దోపిడీని అరికట్టాలి. లక్షల్లో ఫీజులు వసూళ్ల దందాను ఆపాలి. అలాగే ర్యాంకుల చదవులను ఆపాలి. పలు తరహాల సిలబస్‌లకు బ్రేక్ వేయాలి. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, టీచర్లను నియమిస్తే..పేదలు కార్పొరేట్ స్కూళ్ల మోజులో పడరు. వాటి వెనకాల పరుగెత్తరు. ఇది గుర్తించి ఉమ్మడి ఎపిలో ప్రభుత్వాలు చర్యలకు ఉపక్రమించాలి.

## వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

### రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీం



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు. ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## పిఠాపురం ఘటనపై సిఎం సీరియస్

### మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం

### వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం



**అమరావతి ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

## స్కూళ్లలో వాటర్ బెల్

### ఢిల్లీ ప్రభుత్వం వినూత్న ఆలోచన

**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..**

**వేసవి నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం మార్గదర్శకాలు**

**విద్యార్థులు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి గంటకు ఒకసారి బెల్ మోగించాలని సూచన**

**తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థుల భద్రత అధికారులకు ప్రధాన ఆందోళనగా మారింది. ఎండ వేడి సంబంధిత ప్రమాదాలను తగ్గించడానికి, వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే రోజులలో పిల్లల భద్రత కోసం ఢిల్లీ పాఠశాలలు ఇప్పుడు తక్షణ చర్యలు చేపడుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది.పిల్లల్లో డీహైడ్రేషన్, వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను అమలు చేయాలని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం, ఈ వేసవి కాలంలో విద్యార్థులకు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి 45 నిమిషాల నుంచి 60 నిమిషాలకు గంట మోగించాలి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న క్రమంలో, విద్యార్థులు క్రమం తప్పకుండా నీటిని తీసుకునేలా ఢిల్లీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది.అలాగే, విద్యార్థులను గ్రూపులుగా చేసి, ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకునేలా బడ్డీ సిస్టంను ప్రవేశపెట్టింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున, మార్నింగ్ అసెంబ్లీని రద్దు చేసింది లేదా వాటిని తక్కువ సమయంలో పాఠశాల లోపల నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ తరగతులను నిషేధించింది. పాఠశాలల్లో వెలుపల నిర్వహించే ఫిజికల్ యాక్టివిటీస్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశించింది. పాఠశాలల్లో నిత్యం చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని పేర్కొంది.ఢిల్లీ ప్రభుత్వం తల్లిదండ్రులు, విద్యార్థులకు కూడా సూచనలు చేసింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించింది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ విషయాన్ని పంచుకోవాలని తెలిపింది. వడగాల్పు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించింది. తమ పిల్లలను తేలికైన గాలి సులభంగా ఆడే కాటన్ దుస్తుల్లో పాఠశాలకు పంపించాలని ప్రభుత్వం తల్లిదండ్రులకు సూచించింది.

## అంగారకుడిపై జీవం ఆనవాళ్లు?..

### కీలక ఆధారాలు గుర్తించిన క్యూరియాసిటీ రోవర్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 22, (ప్రజావినికిడి):** అంగారక గ్రహంపై జీవం ఉనికి గురించి దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణలో నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ మరో కీలక ముందడుగు వేసింది. అరుణ గ్రహం ఉపరితలంపై జరిపిన సరికొత్త రసాయన ప్రయోగంలో జీవానికి మూలమైన సేంద్రియ అణువులను (ాతీస్త్రుఖఅఱఎ వీశీశ్రీవఎబశ్రీవం) గుర్తించింది. భూమి మీద జీవానికి ప్రాథమిక నిర్మాణ ఇటుకలుగా పరిగణించే ఈ రసాయనాల గుర్తింపు, మార్స్ అధ్యయనంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. క్యూరియాసిటీ రోవర్ అంగారకుడి భూమధ్యరేఖకు సమీపంలో ఒకప్పుడు సరస్సుగా ఉండి ఎండిపోయిన ప్రాంతంలో ఈ పరిశోధన జరిపింది. ఇక్కడ ఏడు వేర్వేరు సేంద్రియ సమ్మేళనాలను రోవర్ గుర్తించగా, వాటిలో ఐదింటిని మార్స్‌పై కనుగొనడం ఇదే తొలిసారి. ఈ సేంద్రియ పదార్థాలు పురాతన జీవుల నుంచి వచ్చాయా?ఉల్కల ద్వారా గ్రహానికి చేరాయా? లేక భౌగోళిక ప్రక్రియల వల్ల ఏర్పడ్డాయా? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే, ఒకవేళ



అంగారకుడిపై జీవం ఉండి ఉంటే, దానికి సంబంధించిన రసాయన ఆనవాళ్లు ఇప్పటికీ భద్రంగా ఉండే అవకాశం ఉందని ఈ ఆవిష్కరణ సూచిస్తోంది. ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ఫ్లోరిడా యూనివర్సిటీ ఆస్ట్రోజియాలజిస్ట్ ప్రొఫెసర్ అమీ విలియమ్స్ మాట్లాడుతూ.. “మేము 350 కోట్ల సంవత్సరాల క్రితం అంగారకుడిపై భద్రపరచబడిన సేంద్రియ పదార్థాలను చూస్తున్నామని భావిస్తున్నాం. అయితే ఇది జీవానికి సంబంధించినదేనా? అన్నది ప్రస్తుత సమాచారంతో చెప్పలేం“ అని వివరించారు. కొన్ని వందల కోట్ల ఏళ్ల కిందట మార్స్‌పై జీవం వృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉండేదని, కానీ నేడు తీవ్రమైన రేడియేషన్, అతి శీతల పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. “ఇంతటి కఠినమైన రేడియేషన్ వాతావరణంలో సేంద్రియ పదార్థాలు మనుగడ సాగించడం నిజంగా ఆశ్చర్యకరం“ అని అమీ విలియమ్స్ తెలిపారు.

గుర్తించిన సమ్మేళనాల్లో డీఎన్ఏ నిర్మాణంలో పాలుపంచుకునే నైట్రోజన్ సమ్మేళనం వంటి నిర్మాణం ఒకటి ఉన్నప్పటికీ, అవి కేవలం “ఇటుకలు మాత్రమే, ఇల్లు కాదు“ అని ఆమె స్పష్టం చేశారు. ఈ ఆవిష్కరణలతో 2028లో ప్రయోగించనున్న యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన రోసలిండ్ ఫ్రాంక్లిన్ రోవర్‌పై అంచనాలు పెరిగాయి. ఈ రోవర్ ఉపరితలం కింద రెండు మీటర్ల లోతు వరకు డ్రిల్ చేసి, రేడియేషన్ నుంచి మరింత సురక్షితంగా ఉన్న నమూనాలను విశ్లేషించగలదు.

# ధోనీ రాకతో సీఎస్‌కే దశ మారుతుందా..?



ఐపీఎల్ 2026 సీజన్ మొదలై అప్పుడే చెన్నై సూపర్ కింగ్స్ 6 మ్యాచ్‌లు ఆడేసింది. కానీ కోట్లాది మంది అభిమానులు ఎదురుచూస్తున్న ఆ ఒక్క రూపం మాత్రం ఇంకా మైదానంలో కనిపించలేదు. తనే.. మన తలా ఎంఎస్ ధోనీ. అయితే, ముంబై ఇండియన్స్‌తో జరగబోయే కీలక పోరుకు ముందు ధోనీ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ధోనీ రీఎంట్రీ పై క్లారిటీ వచ్చేసింది. సాధారణంగా అయితే ఎంఎస్ ధోనీ నెట్స్‌లో వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చాలా అరుదు. ఆయన ఎక్కువగా బ్యాటింగ్ లేదా సరదాగా బౌలింగ్ చేస్తూ కనిపిస్తారు. కానీ, ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌కు ముందు ధోనీ వికెట్ కీపింగ్ గ్లోవ్స్ ధరించి ప్రాక్టీస్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబై మాజీ ప్లేయర్ ఆదిత్య తారే దీని మీద స్పందిస్తూ.. "నేను ధోనీని నెట్స్‌లో కీపింగ్ చేయడం ఎప్పుడూ చూడలేదు. ఇది నిజంగా షాకింగ్. బహుశా ఆయన తన మ్యాచ్ ఫిట్‌నెస్‌ను పరీక్షించుకుంటున్నట్లు ఉన్నారు." అని పేర్కొన్నారు. ఇది సీఎస్‌కే శిబిరంలో గుడ్ సిగ్నల్స్ పంపుతోంది. ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ కాఫ్ ఇంజూరీ (పిక్క గాయం) బారిన పడ్డారు. దీనివల్ల సీజన్ లో మొదటి 6 మ్యాచ్‌లకు ఆయన దూరమయ్యారు. ధోనీ లేకపోవడం వల్ల చెన్నై జట్టు 6 మ్యాచ్‌లలో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. జట్టులో గేమ్ అవేర్‌నెస్ లోపించిందని, క్లిష్ట సమయాల్లో ధోనీ వంటి సీనియర్ అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు ఆయన ప్రాక్టీస్ మొదలుపెట్టడంతో, ఏప్రిల్ 23న ముంబైతో జరిగే మ్యాచ్‌లో ఆయన బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గడిచిన రెండు సీజన్లలో ధోనీ లోయర్ ఆర్డర్ (నంబర్ 7 లేదా 8)లో వచ్చి మెరుపులు మెరిపించారు. 2024 ఐపీఎల్‌లో 161 పరుగులు చేసిన ఆయన, 2025 సీజన్‌లో 14 మ్యాచ్‌లలో 196 పరుగులు సాధించారు. స్ట్రైక్ రేట్ విషయంలో యువకుల కంటే బెటర్ గా ఉండటం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది కూడా అదే దూకుడును కొనసాగించాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముంబై ఇండియన్స్‌పై ధోనీకి మంచి రికార్డు ఉండటం ప్లస్ పాయింట్. ఐపీఎల్‌లో ముంబై, చెన్నై మ్యాచ్ అంటేనే ఒక ఎల్ క్లాసికో. ఇరు జట్లు చెరో ఐదుసార్లు టైటిల్ గెలిచాయి. ప్రస్తుత పాయింట్ల పట్టికలో చెన్నై వెనుకబడి ఉన్న తరుణంలో, ధోనీ రాక జట్టులో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో ధోనీ సలహాలు జట్టుకు కొండంత బలాన్ని ఇస్తాయి. రేపటి మ్యాచ్‌లో ధోనీ టాస్ సమయానికి జట్టులో ఉంటారా లేదా అన్నదే ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న.

# యువ పేసర్‌కు హగ్ ఇచ్చిన కావ్య మారన్




సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్, ఆ జట్టు యువ పేసర్ ప్రఫుల్ హింగేకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ప్రఫుల్ హింగేను కావ్య మారన్ హగ్ చేసుకున్నట్లుగా ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమైంది. అరంగేట్ర మ్యాచ్‌లోనే ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ప్రఫుల్ హింగే మూడు వికెట్లు తీసి ఈ ఫీట్ సాధించిన తొలి బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఐపీఎల్ కెరీర్ ప్రారంభించిన ప్రఫుల్ హింగే.. 4 వికెట్లతో మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన కనబర్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో తన రెండో మ్యాచ్‌లో వికెట్ తీయకపోయినా.. ఆఖరి ఓవర్‌లో కట్టడిగా బౌలింగ్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో గత మ్యాచ్‌కు ప్రఫుల్ హింగే బెంచ్‌కే పరిమితమయ్యాడు. అయితే ఈ యువ పేసర్ ప్రదర్శనకు ఫిదా అయిన కావ్య మారన్.. ఈ కుర్రాడిని హగ్ చేసుకున్నట్లు కొందరు ఆకతాయిలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఫేక్ వీడియోను సృష్టించారు. ఈ వీడియోలో ప్రఫుల్ హింగేతో పాటు మరో యువ పేసర్ సాకిబ్ హుస్సేన్‌ను కావ్య మారన్ ప్రత్యేకంగా అభినందించినట్లు ఉంది. అయితే ఈ వీడియోను చూస్తేనే ఇది ఏఐతో తయారు చేసిందనే విషయం స్పష్టంగా అర్థమవుతుంది. అయితే ఇది తెలియని కొందరు అభిమానులు నిజమేనని భావించి.. వైరల్ చేస్తున్నారు.
'కుర్రాళ్ల ప్రతిభకు ఫిదా అయిన కావ్య మారన్ వారిని హగ్ చేసుకొని ప్రశంసించింది. ఆమె హగ్‌తో కుర్రాళ్లు సంతోషానికి గురయ్యారు.'
అనే క్యాప్షన్స్ రాసుకొస్తున్నారు. అయితే ఈ వీడియోలో ఎలాంటి నిజం లేదు. కావ్య మారన్ ఎప్పుడూ మైదానంలోకి రారు. ఆటగాళ్లతో కూడా చాలా తక్కువగా మాట్లాడుతారు. ఐపీఎల్ 2024 ఫైనల్ ఓటమి అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి కావ్య మారన్ తొలిసారి వచ్చారు. ఓటమి బాధలో ఉన్న ఆటగాళ్లను ఓదార్చారు. అంతే తప్పా ఎప్పుడూ ఆమె మైదానంలో అడుగుపెట్టలేదు. గ్యాలరీలోనే సందడి చేసి అక్కడి నుంచే వెళ్లిపోతారు. కావ్యమారన్‌పై డీప్ ఫేక్ వీడియోలు సృష్టించడం ఇదే తొలిసారి కాదు. గతంలో జై షా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లతో సన్నిహితంగా ఉన్నట్లు ఫేక్ వీడియోలను సృష్టించి వైరల్ చేశారు.

# సోదరుడితో విభేదాలపై కృనాల్ రియాక్షన్



ఐపీఎల్‌లో పాండ్య బ్రదర్స్ (కృనాల్- హార్దిక్) సందడి అంతా ఇంతా కాదు. ఈ సోదరులు ఇద్దరు తమ ప్రదర్శనతో ఈ లీగ్‌లో ఉత్తమ ప్లేయర్లుగా ఎదిగారు. కెరీర్ తొలినాళ్లలో ఈ ఇద్దరూ ముంబయి ఇండియన్స్‌కే ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత ఒక్కరు ఒక్కో టీమ్‌కు ఆడుతున్నారు. అయితే ప్రత్యర్థులుగా బరిలోకి దిగినప్పటికీ పాండ్య బ్రదర్స్ స్పోర్ట్స్ స్పిరిట్ మెచ్చుకునేలా ఉంటుంది. మైదానం బయట కూడా వీళ్లద్దరూ ఇంకా ప్రేమగా ఉండేవారు. అయితే ఈ ఇద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు ఇటీవల ప్రచారం సాగుతోంది. మరోవైపు, కొంతకాలంగా ఈ ఇద్దరూ మునుపటిలా క్లోజ్‌గా కూడా ఉండడం లేదు. కొన్ని నెలలుగా ఒకే ఫ్రేమ్‌లో పాండ్య బ్రదర్స్ అసలు కనిపించింది లేదు. కనీసం సోషల్ మీడియాలోనైనా ఒకరినొకరు పలకరించుకున్నదీ లేదు. అయితే రీసెంట్‌గా ముంబయి ఇండియన్స్- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో కృనాల్ ఆర్సీబీకి, హార్దిక్ ముంబయికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ ఇద్దరు ఎదురుపడ్డప్పుడు మాట్లాడుకుంటారేమో అని అభిమానులు ఎదురుచూశారు. కెమెరాలు కూడా వీళ్లిద్దర్నీ ఫోకస్ చేశాయి. కానీ మ్యాచ్ సందర్భంగా ఎదురుపడినప్పటికీ పాండ్య బ్రదర్ ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. దీంతో అన్నదమ్ముళ్ల మధ్య విభేదాలు నిజమేనని అంతా అనుకుంటున్నారు! అయితే తమ సోదరుల మధ్య అంతా సవ్యంగా లేదన్న వార్తలపై కృనాల్ స్పష్టతనిచ్చాడు. తాజాగా అతడు ఆర్సీబీ ఇన్‌సైడర్స్ మిస్టర్ నాగ్స్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో 'గతేడాది నువ్వు నా షోకు రాలేదు. అప్పుడు నేను ఫోన్ చేస్తే నువ్వు ఫ్యామిలీలో బిజీగా ఉన్నానని చెప్పావు. అంటే ఆర్సీబీ నీ ఫ్యామిలీ కాదా' అని అడిగాడు. దీనికి కృనాల్ 'ఆర్సీబీ కూడా నా ఫ్యామిలీనే. నేను చెప్పాను కానీ నువ్వు సరిగ్గా విననట్లు ఉన్నావు. అయితే ఇంట్లో అనేకమంది ఫ్యామిలీ మెంబర్స్ ఉంటారు. కానీ ఒక్కోసారి ఒకరిని మిస్ అవుతాము' అని అన్నాడు. దీనికి నాగ్స్ వెంటనే 'మీ సోదరుడి లాగానే' అని అన్నాడు. దీనికి కృనాల్ నవ్వేశాడు. ఈ క్రమంలోనే తమ బ్రదర్స్ మధ్య అంతా సవ్యంగానే ఉందా అని కృనాల్‌ను నాగ్స్ అడిగాడు. "మీ ఇద్దరి మధ్య అంతా బాగానే ఉందా లేదా ఏమైనా గొడవలు జరుగుతున్నాయా" అని అడగ్గా, కృనాల్ ఒక్కసారిగా నవ్వేశాడు. అప్పుడు హోస్ట్ "కేన్, అండర్‌టేకర్ కూడా కొన్నిసార్లు గొడవ పడతారు అది కామనే" (రెజ్లర్లను ఉద్దేశించి) అని వ్యాఖ్యానించాడు. దీనికి "అంతా బాగానే ఉంది" అని కృనాల్ నవ్వుతూ బదులిచ్చాడు. దీంతో అన్మదమ్ముళ్ల మధ్య గొడవలు అన్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పడినట్లే అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలి

## టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్



పాట్ కమిన్స్ వచ్చినా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్‌కు టీమిండియా మాజీ క్రికెటర్లు హర్భజన్ సింగ్, సంజయ్ బంగర్ సూచించారు. ఇషాన్ సారథ్యంలో జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తుందని, ఆ మూమెంటమ్‌ను దెబ్బతీయవద్దని కోరారు. వెన్ను గాయంతో పాట్ కమిన్స్ ఐపీఎల్ ఫస్టాఫ్ మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న కమిన్స్.. జట్టుతో కలిసాడు. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్ వేదికగా జరిగే తమ తదుపరి మ్యాచ్‌తో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. కమిన్స్ రాకతో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీ మార్పు జరుగుతుందా లేదా అనే సస్పెన్స్ నెలకొంది. ఈ వ్యవహారంపై జియో హాట్‌స్టార్ షోలో హర్భజన్ సింగ్, టీమిండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ మాట్లాడారు. ఈ ఇద్దరూ ఇషన్ కిషన్‌నే సారథిగా కొనసాగించాలని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్‌కు సూచించారు. 'పాట్ కమిన్స్ తిరిగి వచ్చినా సరే.. ఇషాన్ కిషనే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా కొనసాగించాలి. ఈ నిర్ణయం చర్చనీయాంశం కావచ్చు. కానీ జట్టు ఒక యువ నాయకుడికి మద్దతు ఇచ్చినప్పుడు.. అతనితోనే ముందుకు సాగాలి. బౌలర్లు, ఇతర ఆటగాళ్లు ఇషాన్ కిషన్‌తో మంచి సమన్వయాన్ని పెంచుకున్నాడు. ఇషాన్ కిషన్‌ను కెప్టెన్‌గా కొనసాగించడం వల్ల సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రయోజనం చేకూరుతుంది.' అని హర్భజన్ సింగ్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడని, కమిన్స్ రాకతో అతన్ని పక్కనపెడితే టీమ్ మూమెంటమ్ దెబ్బతింటుందని సంజయ్ బంగర్ హెచ్చరించాడు. 'సారథిగా ఇషాన్ కిషన్ తన బౌలర్లను సమర్థవంతంగా ఉపయోగించకుంటున్నాడు. ఏ బ్యాటర్ మీద ఏ బౌలర్‌ను ఉపయోగించాలనే విషయంలో అతనికి స్పష్టమైన అవగాహన ఉంది. ఇది అతను ఆటను ఎంత బాగా నియంత్రిస్తున్నాడో చెప్పడానికి ఒక నిదర్శనం. తీవ్ర ఒత్తిడిలో కూడా ఇషాన్ కిషన్ ఎలాంటి గందరగోళానికి గురికాకుండా.. తొందరపడకుండా మైదానంలో సరైన నిర్ణయాలు తీసుకుంటున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో స్పిన్నర్లను ఉపయోగించిన తీరు అద్భుతం. పాట్ కమిన్స్ ఇప్పుడిప్పుడే గాయం నుంచి కోలుకున్నాడు. అతను ఏ మేరకు రాణిస్తాడో చెప్పలేం. సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ కూడా ఇషాన్ కిషన్‌నే కొనసాగించాలనే యోచనలో ఉండవచ్చు.' అని సంజయ్ బంగర్ అభిప్రాయపడ్డాడు. మెజార్టీ అభిమానులు కూడా ఇషాన్ కిషన్‌నే కెప్టెన్‌గా కొనసాగించాలని కోరుకుంటున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు మీద ఉంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానంలో కొనసాగుతోంది.

# దిల్షాన్ మదుశంక ఐపీఎల్ అరంగేట్రం



సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడుతూ దిల్షాన్ మదుశంక మంగళవారం (ఏప్రిల్ 21న) ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. అతను తన దేశం శ్రీలంకకు చెందిన పథుమ్ నిస్సంకను అవుట్ చేయడం ద్వారా తన మొదటి ×ఐపీఎల్ వికెట్‌ను సాధించాడు. మదుశంక 4 ఓవర్లలో 36 పరుగులు ఇచ్చి 1 వికెట్ తీశాడు. 2023లో భారత్‌తో జరిగిన ఒక మ్యాచ్‌లో ఏకంగా 5 వికెట్లు పడగొట్టాడు. అందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వికెట్లు కూడా ఉన్నాయి. దిల్షాన్ మదుశంకను సన్‌రైజర్స్ హైదరాబాద్ నేరుగా వేలంలో కొనుగోలు చేయలేదు. కానీ అతను రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌గా జట్టులోకి వచ్చాడు. విదేశీ ఆటగాడు బ్రైడన్ కార్స్ స్థానంలో రూ. 75 లక్షల మొత్తంతో మదుశంక సన్‌రైజర్స్ లో చేరాడు. అంతకుముందు అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుత ప్రదర్శన కారణంగా ముంబై ఇండియన్స్ గతంలో కొనుగోలు చేసింది. 2024లో ముంబై మదుశంకను రూ. 4.60 కోట్లకు కొనుగోలు చేసింది. గాయం కారణంగా మదుశంక ఆ ఏడాది ఐపీఎల్ అరంగేట్రం చేయకుండానే తప్పుకున్నాడు. దిల్షాన్ మదుశంక ( 2000 జనవరి 18న శ్రీలంకలోని హంబన్‌తోట నగరంలో జన్మించాడు. లెఫ్ట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్ అయిన మదుశంక శ్రీలంక జట్టు తరపున 2022లో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. మదుశంక 2022లో తన మొదటి టీ20 అంతర్జాతీయ మ్యాచ్ సైతం ఆడాడు. 2023 జనవరి 10న వన్డేల్లో అరంగేట్రం చేసే అవకాశం లభించింది. అతని మొదటి మ్యాచ్ టీమ్ ఇండియాతో జరిగింది. ఇందులో ఒక వికెట్ తీశాడు. అయితే ఇప్పటి వరకు మదుశంక అత్యుత్తమ స్పెల్ భారత్‌పైనే నమోదైంది. లంక పేసర్ దిల్షాన్ మదుశంక 28 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. ఒకసారి ఐదు వికెట్ల ఘనత సాధించాడు. అతని ఈ స్పెల్ భారత్‌తోనే టీమిండియాపై జరిగింది. 2023 నవంబర్ 2న వాంఖడేలో జరిగిన ఈ మ్యాచ్‌లో లంక పేసర్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్ తో పాటు శ్రేయస్ అయ్యర్ వంటి దిగ్గజ బ్యాటర్లను అవుట్ చేసి 5 వికెట్ల హాల్ సాధించాడు. ఈ ఐదుగురు మ్యాచ్ విన్నర్లు కావడంతో మదుశంకతో మంచి గుర్తింపు లభించింది. మదుశంక తన కెరీర్‌లో లంక తరఫున 1 టెస్ట్, 28 వన్డేలు, 19 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. వన్డేల్లో 50 వికెట్లు, టీ20ల్లో 20 వికెట్లు పడగొట్టాడు.

# నికోలస్ పూరన్ ఎంపికకు అనుభవమే ప్రధాన కారణం

## లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నా.. నికోలస్ పూరన్‌ను ఆడించడానికి అతని అనుభవమే ప్రధాన కారణమని లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ తెలిపాడు. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో మార్పులు చేసినా నికోలస్ పూరన్‌ను పక్కన పెట్టలేమని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రిషభ్ పంత్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం. గతం గురించి పట్టించుకోకుండా ప్రస్తుత మ్యాచ్‌పైనే ఫోకస్ పెట్టాలనుకుంటున్నాం. ముందుగా బౌలింగ్ చేసి రాజస్థాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని అనుకుంటున్నాం. లక్నోలో పిచ్ కండిషన్స్ సవాల్‌గా ఉన్నాయి.
ఈ ఛాలెంజ్‌ను మేం ఇష్టపడుతున్నాం. మా సొంతగడ్డపై ఎలా ఆడాలో మేం ఒక మార్గాన్ని కనుగొంటాం. వరుస వైఫల్యాల నేపథ్యంలో తుది జట్టులో స్వల్ప మార్పులు చేశాం. జట్టు స్థిరత్వం దెబ్బతినకుండా ఈ మార్పులు చేశాం. మా బౌలింగ్ విభాగంలో రెండు మార్పులు జరిగాయి.. సిద్ధార్థ్ స్థానంలో దిగ్వేష్ రతి, ఆవేష్ స్థానంలో మయాంక్ యాదవ్ జట్టులోకి వచ్చారు. నికోలస్ పూరన్‌ను తుది జట్టు నుంచి తప్పించలేం.

# మెగాస్టార్‌కు పెళ్లి పత్రిక అందజేసిన సాయి శ్రీనివాస్



టాలీవుడ్ యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఓ ఇంటివాడు కాబోతున్నారు. గత కొంతకాలంగా ఆయన పెళ్లిపై వస్తున్న వార్తలకు తెరదించుతూ, వివాహ వేడుకలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పెళ్లి శుభలేఖను మెగాస్టార్ చిరంజీవికి అందజేసి, ఆయన ఆశీస్సులు అందుకున్నారు. ఇవాళ సాయి శ్రీనివాస్ తన తండ్రి, ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేశ్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి చిరంజీవి నివాసానికి వెళ్లారు. తమ కుటుంబ వేడుకకు తప్పకుండా హాజరు కావాలని మెగాస్టార్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి కాబోయే వరుడు సాయి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఈ ఆత్మీయ కలయికకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులు, నెటిజన్లు `#SreenivasaKavyanam` అనే హ్యాష్‌ట్యాగ్‌తో కొత్త జంటకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ వివాహ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు బెల్లంకొండ సురేశ్ భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పెళ్లికి టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరుకానున్నారని సమాచారం.

# టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్... బాలకృష్ణ-కొరటాల శివ చిత్రం!



నందమూరి బాలకృష్ణ తన జోరును కొనసాగిస్తున్నారు. వరుస విజయాలతో ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆయన, తన తదుపరి చిత్రానికి సంబంధించి ఓ క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న బాలకృష్ణ, ఆ తర్వాత సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ కొరటాల శివతో పనిచేయబోతున్నారు. ఈ వార్త ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

సినీ వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం బాలకృష్ణ తదుపరి చిత్రం కొరటాల శివ దర్శకత్వంలో ఖరారైంది. నిజానికి ఈ ప్రాజెక్ట్ కోసం వివేక్ ఆత్రేయ, విజయ్ కనకమేడల వంటి యువ దర్శకుల పేర్లు పరిశీలనకు వచ్చినప్పటికీ, కొరటాల శివ వినిపించిన కథాంశానికి బాలయ్య పూర్తిస్థాయిలో కనెక్ట్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ‘అఖండ‘తో మొదలుపెట్టి ‘వీరసింహారెడ్డి‘, ‘భగవంత్ కేసరి‘ వంటి చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలు అందుకున్న బాలయ్య, అరవై ఏళ్లు దాటినా కుర్ర హీరోలకు దీటుగా సినిమాలు చేస్తున్నారు. మరోవైపు కొరటాల శివ తనదైన ప్రత్యేక శైలితో ఇండస్ట్రీలో నిలిచారు. ‘మిర్చి‘, ‘శ్రీమంతుడు‘, ‘జనతా గ్యారేజ్‘ వంటి బ్లాక్‌బస్టర్లతో కమర్షియల్ హంగులతో పాటు బలమైన సందేశాన్ని ఇవ్వడంలో ఆయన దిట్ట. ‘ఆచార్య‘తో కాస్త తడబడ్డా, ‘దేవర‘ చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా భారీ విజయాన్ని నమోదు చేసి తన సత్తాను మరోసారి నిరూపించుకున్నారు. మాస్ పల్స్ తెలిసిన బాలకృష్ణ ఇమేజ్‌కి, హీరోను పవర్‌ఫుల్‌గా చూపిస్తూనే కథలో సందేశాన్ని మిళితం చేసే కొరటాల మార్క్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ పవర్‌ఫుల్ కాంబినేషన్‌పై ట్రేడ్ వర్గాల్లో సైతం భారీ అంచనాలు నెలకొన్నాయి. పక్కా కమర్షియల్ ఫార్మాట్‌లో బాలకృష్ణను కొరటాల ఎలా ప్రెజెంట్ చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



# పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ’పెద్ది’కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ఎ÷–లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి ’ఎవడు’ సినిమాలో ’పింపుల్ డింపుల్’ పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన ’ఆగడు’ సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు ’పెద్ది’లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ’పెద్ది’ సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ’ఉప్పెన’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

# దర్శక నిర్మాత త్రిపురనేని చిట్టిబాబు కన్నుమూత



ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు, రాజకీయ విశ్లేషకుడు త్రిపురనేని చిట్టిబాబు (71) కన్నుమూశారు. గుండెపోటుతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన, మంగళవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు.

కృష్ణా జిల్లా కాజా గ్రామానికి చెందిన చిట్టిబాబు అసలు పేరు వరప్రసాద్. ఆయన తండ్రి, ప్రముఖ నిర్మాత అయిన త్రిపురనేని మహారథి వారసత్వంగా సినీ రంగంలోకి ప్రవేశించారు. తొలినాళ్లలో ఆత్రేయ, అప్పలాచార్య వంటి దిగ్గజాల వద్ద రచనా విభాగంలో సహాయకుడిగా పనిచేశారు. ఆ తర్వాత ‘సంతానం‘ సినిమాతో దర్శకుడిగా మారారు. చిట్టిబాబు తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో బహుముఖ ప్రజ్ఞ కనబరిచారు. 12 చిత్రాలకు దర్శకత్వం వహించగా, 49 సినిమాలకు కో–డైరెక్టర్‌గా వ్యవహరించారు. అంతేగాక సుమారు 30కి పైగా చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా ప్రేక్షకులను మెప్పించారు. నిర్మాతగానూ పలు చిత్రాలను నిర్మించారు.

దివంగత నటి సౌందర్యను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేసింది చిట్టిబాబే కావడం విశేషం. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



## చిరుతో బాబీ సినిమా

# నెగెటివ్ రోల్‌లో డింపుల్

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ’వాల్తేరు వీరయ్య’తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.

# కొత్త గృహంలోకి బన్నీ?

## జూబ్లీహిల్స్‌లో ఖరీదైన ఇంటి నిర్మాణం




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ’పుష్ప’ సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, ’అల్లు స్టూడియోస్’ నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం.సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్ కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613